


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 14-03-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 180 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఏపీకి న్యాయం జరిగేవరకూ
# పోరాటం ఉద్ధృతం

- ప్రజల తరపునే ప్రతినిధులు నిలబడాలి
- తమ డిమాండ్లు హేతుబద్ధమైనవి
- సభకు ఎవరూ గైర్హాజరు కావొద్దని
- పార్టీ ఎంపీలతో చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి : ఢిల్లీలో ఎంపీల పోరాటానికి సంఘీభావంగా రాష్ట్రంలో స్థానికంగా క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలని, అక్కడ, ఇక్కడ ఆందోళనలు నిర్మాణాత్మకంగానే జరగాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతలకు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన స్పష్టంచేశారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పునర్వవస్థీకరణ చట్టం, హామీల అమలుపై మంగళవారం శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేయనున్నట్లు సీఎం తెలిపారు.

ప్రజల తరపునే ప్రతినిధులు నిలబడాలని..., ప్రజల గొంతు పార్లమెంటులో ప్రతిధ్వనించాలని తరువాయి 2లో

## అత్యంత సంపన్న ఎంపీగా జయాబచ్చన్!




దిల్లీ: దేశంలోనే అత్యంత సంపద కలిగిన ఎంపీగా బాలీవుడ్ నటి, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న ఎంపీ జయాబచ్చన్ నిలవనున్నారు. రాజ్యసభ ఎన్నికల నిమిత్తం ఆమె నామినేషన్ పత్రాలతో పాటు తన ఆస్తులకు సంబంధించిన వివరాల జాబితాను అఫిడవిట్ రూపంలో ఎన్నికల అధికారులకు సమర్పించారు. దీని ప్రకారం ఆమె స్థిర, చర ఆస్తులు దాదాపు రూ.1,000కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2014 రికార్డుల ప్రకారం అత్యధిక సంపద కలిగిన రాజ్యసభ ఎంపీగా భాజపాకు తరువాయి 2లో

## నెత్తురోడిన అటవీ ప్రాంతం
### మావోయిస్టుల ప్రతీకారం.. నక్సల్స్ అటాక్.. 9 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి





బస్తర్: చత్తీస్‌ఘడ్‌లో బాంబు పేలిన ఘటనలో 9 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. సుక్మా జిల్లాలో ఈ దాడి జరిగింది. సుక్మాలోని కిస్టారమ్-పేలోడి రోడ్‌లో బాంబు పేలుడు ఘటన చోటుచేసుకున్నది. మావోలతో జరిగిన ఎదురుకాల్పుల తర్వాత ఇవాళ ఉదయం భద్రతా బలగాలు సుక్మా ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించాయి. ఆ సమయంలో బాంబులు పేలడంతో సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో నక్సల్స్ ఎన్‌కౌంటర్ జరిపారు. ఆ తర్వాత వాళ్లు పారిపోయారు. వారి కోసం జవాన్లు కూంబింగ్ నిర్వహించారు. తరువాయి 2లో



## పోలవరంపై సమావేశం

న్యూఢిల్లీ: పోలవరం నిర్మాణం, భూసేకరణపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ అధికారులతో ఏపీ అధికారులు సమావేశమయ్యారు. సమావేశానంతరం ఏపీ నీటిపారుదల శాఖ కార్యదర్శి శశిభూషణ్ మాట్లాడుతూ పోలవరం వ్యయం, భూసేకరణ, పునరావాస ప్యాకేజీపై చర్చించినట్లు పేర్కొన్నారు. సవరించిన అంచనాల డీపీఆర్‌ను త్వరగా పరిశీలించాలని కోరాకమని పేర్కొన్నారు. పోలవరంపై ఎలాంటి రిమార్క్స్ లేవని, పోలవరాన్ని త్వరగా పూర్తి చేయాలని సీడబ్ల్యూసీని కోరామని శశిభూషణ్‌కుమార్ తెలిపారు.



## జగన్‌తో రహస్య ఒప్పందాలు లేవు

అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో తమకు రహస్య ఒప్పందాలు ఏమీ లేవని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పారు. ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక హోదాపై చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా అంటే తెలియని వాళ్లు చాలా మంది ఉన్నారని సెటైర్లు వేశారు. అంతేకాదు హోదా వల్ల రాయితీలు వస్తాయనే భావనలో కూడా ఉన్నారని వ్యాఖ్యానించారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి 42 శాతం నిధులు వస్తాయని చెప్పారు. రెవెన్యూ లోటు రూ. 4,117 కోట్లని కేంద్రం తేల్చిందన్నారు. జాతీయ సంస్థలకు ఇచ్చిన భూముల విలువ లెక్కగట్టడం, రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఏమీ చేయలుదనడం సరికాదన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ వచ్చి తీరుతుందని విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు.

## విశాఖకు రైల్వే జోన్ వస్తుంది
### భాజపా ఎమ్మెల్సీ మాధవ్



అమరావతి: విశాఖ రైల్వేజోన్ అధికారుల నివేదికలతో కాకుండా రాజకీయ నిర్ణయంతోనే సాధ్యమవుతుందని.. ఆ పని భాజపా చేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. రైల్వేజోన్ సాధ్యం కాదని కేంద్ర అధికారులు నివేదించిన నేపథ్యంలో ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. తరువాయి 2లో

## 11 మంది కాంగ్రెస్
# ఎమ్మెల్యేలపై వేటు



హైదరాబాద్ : మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై సోమవారం అసెంబ్లీలో జరిగిన దాడిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ ఘటనకు బాధ్యులుగా చేస్తూ 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను శాసనసభాపతి మధుసూదనాచారి సస్పెండ్ చేశారు. జానారెడ్డితోపాటు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, జీవన్ రెడ్డి, గీతా రెడ్డి, చిన్నా రెడ్డి, డీకే అరుణ, పద్మావతి, టి.రామ్మోహన్ రెడ్డి, డి.మాధవ రెడ్డి, వంశీచంద్‌లపై సస్పెన్షన్‌వేటు వేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలు రద్దు చేశారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ బహిష్కరణ ఉంటుందని స్పీకర్ ప్రకటించారు.

అనంతరం సస్పెండైన సభ్యులు సభను వీడాలని స్పీకర్ కోరారు. మండలి ఛైర్మన్‌పై జరిగిన దాడి చూసి తాను షాక్‌కు గురయ్యానని పేర్కొన్నారు. నాలుగు తరువాయి 2లో

## ఏపీ, తెలంగాణకు వేర్వేరుగా బార్ కౌన్సిళ్లు



న్యూఢిల్లీ: రెండు రాష్ట్రాలుగా విడిపోయిన అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య పంపకాలు జరగాల్సినవి కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయి. ఇప్పటికీ కొన్ని ఇరు రాష్ట్రాలకు ఉమ్మడిగానే కొనసాగుతున్నాయి. అందులో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది హైకోర్టు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైకోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున విభజన అనంతరం ఏపీ హైకోర్టును కూడా ఇక్కడే కొనసాగించారు. అయితే తమకు ప్రత్యేక హైకోర్టు కావాలని తెలంగాణ ప్రభుత్వం ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తోంది. కాగా సుప్రీం కోర్టు దీనిపై కొంత సానుకూలంగా స్పందించింది. ఏపీ, తెలంగాణకు వేర్వేరుగా తరువాయి 2లో




## కొనసాగుతున్న ఆందోళన పర్వం.. లోక్‌సభ వాయిదా

దిల్లీ: పార్లమెంటులో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు లోక్‌సభలో ఆందోళన కొనసాగిస్తున్నారు.

ప్లకార్డులు చేతబూని స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించడంతో పాటు... విభజన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. తెదేపా ఎంపీల ఆందోళనతో లోక్‌సభ ముందుగా 12 గంటల వరకు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ఎంపీల ఆందోళనతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను రేపటికి వాయిదా

అటు రాజ్యసభలోనూ ఆందోళనలు కొనసాగాయి. దీంతో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

అంతకుముందు తెలుగుదేశం ఎంపీలు పార్లమెంటు ప్రాగంణంలోని గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




## ఆధార్‌కు డెడ్‌లైన్ లేదు..

- సుప్రీం సంచలన ఆదేశాలు
- ఆధార్ తప్పనిసరి అంటూ కేంద్ర బలవంతం తగదు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డ్ డెడ్‌లైన్‌పై సుప్రీం కోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చింది. బ్యాంకులు, మొబైల్ నంబర్లతో ఆధార్ అనుసంధానానికి 'మార్చి 31' డెడ్ లైన్ అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పష్టత ఇచ్చింది. తుది తీర్పు వచ్చేవరకు ఎలాంటి డెడ్‌లైన్లు లేవని ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ బెంచ్‌కు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. ఆధార్ తప్పనిసరంటూ కేంద్ర బలవంతం చేయడం తగదని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటికి ఆధార్ తప్పనిసరి చేయడం మొదలుపెట్టారు. బ్యాంక్, మొబైల్ ఇలా అన్ని అకౌంట్లకు ఆధార్ అనుసంధానం అనేది కచ్చితమైపోయింది. దీంతో సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు. మొదట డెడ్ లైన్ ఫిబ్రవరి 28గా ప్రకటించారు. ఆ తర్వాత మళ్లీ మార్చి 31 అని తెలిపారు. దీనిపై ఆందోళన చెందుతున్న సమయంలో సుప్రీం తాజా ఆదేశాలు వెలువరించింది.

## ఎస్సీ కార్పొరేషన్ నిధుల గురించి తెలుసుకోవాలి

రోలుగుంట : మండలంలో ప్రతీ గ్రామంలోను ఎస్సీ కార్పొరేషన్ నుండి వచ్చే నిధులు గురించి ప్రజలకు తెలియ జేయాలని ఎస్సీ కార్పొరేషన్ విభాగ అధిపతి ఎలిషా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గల ఎస్సీ కార్పొరేషన్ అనుసంధానకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిషా మాట్లాడుతూ ప్రజలకు కార్పొరేషన్ నుండి వచ్చే నిధుల గురించి తెలియజేయాలని వారు కోరారు.

## ఎంపీ కవితకు మోదీ, కేసీఆర్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు మంగళవారం. ఈ సందర్భంగా ఆమెకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పీఎం, సీఎం ఇద్దరూ ప్రకటనలు విడుదల చేశారు. మీకు హృయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు ప్రజలకు సేవలందించాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని కోరుకుంటున్నాను. అని ప్రకటనలో కేసీఆర్ పేర్కొన్నారు.

మీ జన్మదినం సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు స్వీకరించండి. దేశ ప్రజలకు మీరు సేవలందించేందుకు వీలుగా కావలసిని ఆరోగ్యకర, ఆనందమయ జీవితాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుతున్నాను. అంటూ ప్రధాని మోదీ కూడా తెలుగులోనే శుభాకాంక్షలు చెప్పడం విశేషం.

## ఈ నెల 15న దేశ వ్యాప్త నిరసనలో పాల్గొనాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము



అచ్యుతాపురం: కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విదానాలు అవలంభిస్తున్నాయని, దేశ సంపద సృష్టిస్తున్న కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము అన్నారు. మంగళవారం స్థానిక సెజ్‌లో గల కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ఆయన అన్నారు. స్వదేశి, విదేశి బహుళ జాతి సంస్థలు మన దేశ సంపదను దోచుకునే విదానాలను నిరశిస్తూ ఈ నెల 15న దేశ వ్యాప్త నిరసనలో బాగంగా అచ్యుతాపురంలో జరిగే నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే కార్మికులకు కనీస వేతనం 18 వేలు ఇవ్వాలన్నారు. ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడుబండ్ల కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో బార్క్ ముఠా కార్మికులు అప్పలనాయుడు, సత్తిబాబు, నాయుడు, అప్పారావు, అబిజిత్, ఆంజనేయా పరిశ్రమల ముఠా కార్మికులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఏపీకి న్యాయం జరిగేవరకూ పోరాటం ఉధృతం

సీఎం దిశానిర్దేశం చేశారు. 5 కోట్ల ప్రజల మనోభావాలపై కేంద్రం ఉదాసీనత భావ్యంకాదన్న ముఖ్యమంత్రి ....అభివృద్ధి ఆగిపోకుండా పోరాటం నిర్మాణాత్మకంగా జరగాలన్నారు. మన హక్కులలో రాజీలేదని, ప్రత్యేక హోదా తమ హక్కు.. ఎందుకివ్వరు? అని ప్రజలు భావిస్తున్నారని సీఎం తెలిపారు.

ప్రజల మనోభావాలకు అనుగుణంగానే తెదేపా ఎంపీల పోరాటం ఉండాలని... శాసన సభ, శాసన మండలి విప్‌లు ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకోవాలన్నారు. పార్లమెంటులో ఇతర పార్టీల ఎంపీలను కూడా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆ రోజు సెంటిమెంటుకు ప్రత్యేక రాష్ట్రమే ఇచ్చారన్నా ముఖ్యమంత్రి.. ఈ రోజు సెంటిమెంటు చూసి డబ్బులు ఇవ్వలేమంటారా? అని ప్రశ్నించారు. ఇదేం న్యాయం.. అని మండిపడ్డారు. ఆ రోజు సెంటిమెంటు చూసి ఒక ప్రాంత ప్రజలను నడిరోడ్డుపైకి నెట్టారన్న సీఎం ఈ రోజు సెంటిమెంటును ఎందుకు పట్టించుకోవడం లేదాని నిలదిశారు. తమ డిమాండ్లు హేతుబద్ధమైనవని.. విభజన చట్టం, పార్లమెంటు హామీలు అమలు చేయాలనడం అహేతుకమా అని ప్రశ్నించారు. ఆర్థిక నేరస్థులు ప్రధానిని కలవడం ఎక్కడైనా ఉందా అని వైకాపాపై మండిపడ్డారు. పీఎంవో చుట్టూ ఏ2 నిందితుడి ప్రదక్షిణలు ఏం సంకేతాలు పంపిస్తున్నాయని ప్రశ్నించారు. ఒకవైపు విశ్వాసం ఉందంటారు,మరోవైపు అవిశ్వాసం పెడతామంటారా అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎందుకీ డ్రామాలు...?నాటకాలు...అని ప్రశ్నించారు.

ప్రజలు వైకాపాను అసహ్యించుకునే రోజు దగ్గరలోనే ఉందన్నారు. తెదేపా ఎంపీలు కలిసికట్టుగా ఉండి.. చిత్తశుద్ధితో పోరాటం చేయాలని హితవు పలికారు. ఇది కీలక సమయమని... సభకు ఎవరూ గైర్హాజరు కావొద్దని కోరారు. కేంద్రం నుంచి ఎంత వచ్చింది, ఇంకా ఎంత రావాలి అనే వివరాలను ఆన్ లైన్‌లో ఉంచామని తెలిపారు. ఈ సమాచారాన్ని ఎంపీలు వినియోగించుకోవాలన్నారు.

సభనుంచి సస్పెండ్ చేస్తే బయట నుంచి పోరాటం ఉధృతం చేయాలని... విభజన చట్టం, హామీలపై సమీక్ష చేయాలని, ప్రజలకు చెప్పడంతోపాటు దేశం మొత్తానికి తెలియాలన్నారు. ఏ సభ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందో... అక్కడే న్యాయం జరగలన్నారు. ఏ పార్టీలైతే రాష్టానికి అన్యాయం చేశాయో అవే న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

## నెత్తురోడిన అటవీ ప్రాంతం

మధ్యాహ్నం 12.30 నిమిషాల సమయంలో మరో సీఆర్‌పీఎఫ్ టీమ్‌ను నక్సల్స్ టార్గెట్ చేశాయి. ఐఈడీని పేల్చడంతో ఎంపీవీ పేలినట్లు తెలుస్తున్నది.

ఎంపీవీని పేల్చేశారు..

మైన్ ప్రొటెక్టెడ్ వెహికిల్.. దీన్ని ఎంపీవీ అంటారు. కూంబింగ్ కోసం ఈ వాహనాలను ప్రత్యేక బలగాలు వాడుతుంటాయి. ఒకవేళ నక్సల్స్ దాడి చేసినా.. ఆ వాహనంలో ఉన్నవారికి ఏమీకాదు. కానీ ఇవాళ సుక్మా జిల్లాలో జరిగిన దాడిలో ఏకంగా ఎంపీవీ వాహనాన్ని మందుపాతరతో పేల్చేశారు. చత్తీస్‌ఘడ్‌లో ఇవాళ జరిగిన పేలుడు ఘటనపై యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ యూనిట్ డీఐజీ అవాస్తీ మాట్లాడారు. ఎంపీవీ వాహనం పేలుడు వల్ల మరింత మంది జవాన్లు మృతిచెంది ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నక్సల్స్‌తో జరిగిన ఫైరింగ్ నిలిచిపోయిందన్నారు. సుక్మా జిల్లాకు తక్షణమే అదనపు బలగాలను పంపించినట్లు ఆయన చెప్పారు. ఆ జిల్లా ఎస్పీ కూడా స్పాట్‌కు చేరుకున్నారు. సీఆర్‌పీఫ్ 208 కోబ్రా బాటాలియన్, మావోల మధ్య ఇవాళ ఉదయం 8 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగినట్లు సీఆర్‌పీఎఫ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. మొదట కోబ్రా జవాన్ల దూకుడును చూసి మావోలు పారిపోయారు. కానీ మధ్యాహ్నం 12.30 నిమిషాలకు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 212 బెటాలియన్‌పై మావోలు దాడి చేశారు. ఎంపీవీ వాహనంలో కిస్టారమ్ పలోడి రోడ్డు మీద వెళ్తున్న ఆ బెటాలియన్‌ను నక్సల్స్ పేల్చేశారు. ఐఈడీని పేల్చడంతో జవాన్ల వాహనం చెల్లాచెదురై పడిపోయింది. గాయపడ్డ జవాన్లను హెలికాప్టర్ ద్వారా హాస్పటల్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నక్సల్స్ దాడి చాలా దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దేశం కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన ప్రతి జవానకు వందనాలర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సమావేశంలో ప్రోటోకాల్ లేదా పిద్ధాంతం ప్రకారం ప్రధాని, రాష్ట్రవ్యాప్తికి ఉండే ప్రాముఖ్య అందరికీ తెలిసిందే. దాన్ని దృష్టిలో ఉంచుకునే భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి కోసం కేంద్రం ప్రత్యేక విమానాలను సిద్ధం చేస్తోంది. సరికొత్త ఆధునిక విమానాలు 2020 నాటికి అందుబాటులోకి వస్తాయని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. ఇటీవలనే ఎయిర్ ఇండియా బోయింగ్ 777-300 ఈఆర్‌లను కొనుగోలు చేశాయి. ఈ రెండు బోయింగ్ విమానాలను వీవీఐపీలకు అనుగుణంగా మార్పు చేస్తారు. ప్రెస్‌కాన్ఫరెన్స్ రూమ్, వీఐపీ ఎన్‌క్లోజర్, అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయంలకు అనుగుణంగా మార్పు చేస్తారు. ఈ విమానాల ప్రత్యేకమైనవి..

వైఫై సదుపాయం కలిగిన ఈ విమానాలు క్షిపణుల దాడులనూ తట్టుకోగలవు. ఇవి భారత్ నుంచి నేరుగా యుఎస్‌కు ఎక్కడా ఆగకుండా వెళ్లగలవు. ఇంధనం కోసం మధ్యలో ఆగాల్సిన అవసరం కూడా ఉండ్దు. ఇప్పటికి ఎయిర్ ఇండియా మూడు బోయింగ్-777 విమానాలను ప్రవేశపెట్టింది. 2006లో 68 విమానాల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చింది. వీటిల్లో రెండు విమానాలను కేవలం వీవీఐపీల కోసమే కేటాయిస్తారు. వీటిని ప్రభుత్వం ఎయిర్ ఇండియా నుంచి కొనుగోలు చేస్తుందని పేరు వెల్లడించడానికి ఒక అధికారి తెలిపారు. ఎయిర్ ఇండియా నుంచి ఈ విమానాలను కొనుగోలు చేసేందుకు వీలుగా గత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.4,469.50 కోట్లు కేటాయించింది. ఎయిర్ ఇండియా మొత్తం 44 మంది పైలెట్లను వీవీఐపీ విమానాలను నడపడానికి వినియోగిస్తుంది. వీరితో పాటు క్యాబిన్ సిబ్బంది, ఇంజనీర్లు, అత్యవసర సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారు.

## అత్యంత సంపన్న ఎంపీగా జయాబచ్చన్!

చెందిన రవీంద్ర కిషోర్‌సిన్హా ఉన్నారు. ఆయన రాజ్యసభలోకి వచ్చే సమయంలో ఆయన ఆస్తులు రూ.800కోట్లుగా చెప్పారు. 2012లో జయాబచ్చన్ ఆస్తులు రూ.493కోట్లుగా చూపించారు. ప్రస్తుతం అమితాబ్ బచ్చన్ జయాబచ్చన్ స్థిరాస్తులు రూ.460కోట్లు కాగా.. చరాస్తులు రూ.540కోట్లు ఉన్నాయి. వారిద్దరికి రూ.62కోట్ల విలువ చేసే బంగారం ఉంది. ఇందులో అమితాబ్‌కు రూ.36కోట్ల విలువైన బంగారం ఉండగా.. జయాకు రూ.26కోట్ల బంగారం ఉంది. వీటితో పాటు రూ.13కోట్ల విలువ చేసే 12కార్లు ఉన్నాయి. రోల్స్ రాయల్స్, మూడు మెర్సిడెస్, పోర్షె, రేంజ్‌రోవర్ కార్లు ఉన్నాయి. అమితాబ్‌కు సొంతంగా టాటా నానో, ట్రాక్టర్ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఇక అమితాబ్, జయాకు ఉన్న వాచ్‌ల ఖరీదు రూ.3.4కోట్లు, రూ.51లక్షలు. అమితాబ్ వద్ద రూ.9లక్షల విలువ చేసే పెన్ను ఉంది. ఫ్రాన్స్‌లో రెసిడెన్షియల్ ప్లాట్ ఉంది. నోయిడా, భోపాల్, పూణె, అహ్మదాబాద్, గాంధీనగర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో బరబంకి జిల్లాలో వీరికి స్థలాలు ఉన్నాయి.

## విశాఖకు రైల్వే జోన్ వస్తుంది

గతానికి, ఇప్పటికీ అధికారుల నివేదికలో తేడా లేదన్నారు. తప్పనిసరిగా విశాఖ రైల్వేజోన్ వస్తుందని... కేంద్రంలోని భాజపా సర్కారు ఇచ్చి తీరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కడప ఉక్కు కర్మాగారం, ఏపీలో నౌకాశ్రయం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక హోదా పేరుతో ప్రజల్ని మభ్యపెట్టవద్దని తెదేపాను కోరారు. హోదాకు సమానమైన నిధులు ప్యాకేజీ రూపంలో ఇస్తామని... అందుకు ప్రత్యేక వాహకాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం చెబుతుంటే రాష్ట్రపభుత్వం ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు.

## 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు

సంవత్సరాల తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈ ఘటన ఓ మచ్చగా నిలిచిపోతుందని అన్నారు. అంతకుముందు సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నిన్నటి అరాచక చర్యను తీవ్రంగా ఖండించారు. సమావేశాలు ముగిసేవరకూ కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీ, తెలంగాణకు వేర్వేరుగా బార్ కౌన్సిళ్లు

బార్ కౌన్సిళ్లు ఏర్పాటు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ లోపు ఏర్పాటు చేయాలని సుప్రీం ధర్మాసనం తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. జూన్ 2న రెండు తెలుగు రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు ఉన్న నేపథ్యంలో.. ఈ కౌన్సిల్స్ కనుక ఏర్పాటు చేస్తే అప్పటి నుంచే రెండు రాష్ట్రాలకు రెండు వేర్వేరు బార్ కౌన్సిల్స్ అందుబాటులోకి వస్తాయి.




మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో పార్కు వైస్ ప్రెసిడెంట్ సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో సేవ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో వాకర్స్ ప్ల కార్డులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో నారాయణరావు, కూర్మారావు, జయకృష్ణ, సీపాన రాము మరియు వాకర్స్ పాల్గొన్నారు.




కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా నగర తెలుగు యువత ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రం అన్ని విధాలా ఆదుకోవాలని, విభజన హామీలు అమలు చేయాలని తెలుగు యువత సభ్యులు డిమాండ్ చేశారు.



## పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ ధ్యేయం



అచ్యుతాపురం: పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ ధ్యేయమని డెయిరీ అచ్యుతాపురం శాఖ మేనేజర్ కూంద్రపు శేషు అన్నారు. మంగళవారం మండలంలోని ముసలమ్మపాలెం గ్రామంలో డెయిరీకి పాలు పోస్తున్న అప్పలనాయుడు, చంటి రైతుల పాడి గేదెలు మృతిచెందటంతో రూ॥35,000లు, రూ॥40,000ల చెక్కులను ఆయన రైతులకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల సంఘు అద్యక్షులు డి.అప్పుడుదొర, డి.అప్పలనాయుడు, కె.చరణ్ కుమార్, అర్జున్, సన్నిబాబు, సూపర్‌వైజర్ రాఘువ, రైతులు పాల్గొన్నారు.

## మెడ్‌టెక్ నష్ట పరిహారంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలి

### -సిపిఐ డిమాండ్



పెదగంట్యాడ: మెడ్‌టెక్ పరిశ్రమ కోసం రైతుల నుంచి భూమిని సేకరించి, అనంతరం రైతులకు చెల్లించే నష్ట పరిహారంలో జరిగిన అవకత వకలపై తక్షణమే విచారణ జరిపించాలని సి.పి.ఐ నేతలు డిమాండ్ చేసారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సి.పి.ఐ నేతలు బి.వెంక ట్రావు, ఎల్లేటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఆర్‌డిఓ వెంకటేశ్వరరావు నష్టపరిహారం చెల్లింపులలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. గత సంవ. మార్చిలో జరిగిన మెడ్‌టెక్ రైతుల నష్టపరిహారం చెల్లింపులలో జరిగిన అవినీతిపై సి.పి.ఐ ఫిర్యాదు చేసిందని, అనంతరం ఆర్.డి.ఓపై జరిపిన విచారణ పై పలు అనుమానాలున్నాయని మొత్తం నష్ట పరిహారంలో పొందిన 170మందిలో 50మంది బినామీలు ఉన్నారని ఆరోపించారు. ఎకరాకు రూ. 12లక్షు నష్టపరిహారం పొందిన బినామీలనుంచి అధికారులకు ఎకరాకు రూ. 3లక్షలు ముట్టాయని ఆరోపించారు. దీనిపై అన్ని పత్రికలలో వార్తలు వచ్చాయని అయినా ఆర్‌డిఓ పై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తక్షణమే జెసి ఆర్.డి.ఓపై విచారణ చేయాలని దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## ధోనీని దాటేసిన సురేశ్ రైనా




కొలంబో: సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు సురేశ్ రైనా. సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో తనదైన ప్రదర్శన చేసి ఆ తర్వాత ముక్కోణపు టోర్నీకి ఎంపికయ్యాడు.

తాజాగా రైనా.. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీని దాటేశాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్లో భారత్ తరపున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో రైనా.. ధోనీని వెనక్కి నెట్టి మూడో స్థానంలో నిలిచాడు. ముక్కోణపు టోర్నీలో భాగంగా సోమవారం భారత్-శ్రీలంక మధ్య టీ20 మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రైనా 27 పరుగులు చేశాడు.

## కార్తీ కేసులో సీబీఐకి హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసు కుంభకోణంలో స్థాయీ నివేదిక అందజేయాలని సీబీఐని ఢిల్లీ హైకోర్టు మంగళవారంనాడు ఆదేశించింది. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కార్తీ చిదంబరం పెట్టుకున్న దరఖాస్తుపై మంగళవారంనాడు హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల అనంతరం ఈ కేసుకు సంబంధించిన స్థాయీ నివేదికను ఈనెల 16లోగా తమకు అందజేయాలని, అలాగే కార్తీ చిదంబరం బెయిల్ అభ్యర్థనపై సమాధానం ఇవ్వాలని సీబీఐని కోర్టు ఆదేశించింది.


ఐఎన్‌ఎక్స్ మిడియా కేసులో ఫిబ్రవరి 28న కార్తీని సీబీఐ అరెస్టు చేయడంతో అప్పట్నించి ఆయన పోలీసు కస్టడీలో ఉన్నారు. సోమవారంనాడు ఆయనను 12 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ నెల 24 వరకూ ఆయన జ్యుడిషియల్ కస్టడీలోనే ఉండాల్సి రావడంతో తీహార్ జైలుకు తరలించారు. కాగా, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ హైకోరును ఆశ్రయించారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత

లక్నో: ఉత్తర్రపదేశ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత బేగం హమీదా హబీబుల్లా మంగళవారంనాడు తన నివాసంలో సుదీర్ఘ అస్వస్థతతో కన్నుమూశారు. ఆమె వయస్సు 102 సంవత్సరాలు.

రాజ్యసభ మాజీ సభ్యురాలైన హబీబుల్లా హైదరాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ దివంగత నవాబ్ నజీర్ జంగ్ బహదూర్ కుమార్తె. పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ కమాండెంట్ జనరల్ ఇనయత్ హబీబుల్లాను బేగం హమీదా పెళ్లాడారు. వారి సంతానమైన వజాహత్ హబీబుల్లా భారత తొలి చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌గా పనిచేశారు. 1965లో తన భర్త ఆర్మీ నుంచి రిటైర్ కావడంతో ఆమె రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. హైదర్‌గఢ్ (బారాబంకీ) నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై 1971 నుంచి 1973 వరకూ హరిజన సంక్షేమం, జాతీయ సమైక్యత, సివిల్ డిఫెన్స్ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత టూరిజం మినిస్టర్‌గా కూడా ఉన్నారు. అనంతరం యూపీ కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా 1980 వరకూ ఉన్నారు. 1969 నుంచి ఏఐసీసీ సభ్యురాలిగా కూడా ఆమె ఎన్నికయ్యారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ




కంచరపాలెం : పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే విజయం సాధించవచ్చని వానపల్లి రవి కుమార్ అన్నారు. ఈమేరకు సెయింట్ ఆంథోనీ పాఠశాలలో మంగళవారం ఉదయం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వానపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకొని ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, సహాయ ప్రధానోపాధ్యాయులు జూలియన్, సూర్యారావులు విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను బహుమతులతో సత్కరించారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవకుమార్, కిషోర్, ఆనందరావు, అంథోని పాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి గోడ పత్రిక ఆవిష్కరణ




అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం నూకాంబిక అమ్మవారి కళ్యాణ మండపంలో అమ్మవారి జాతర గోడపత్రికను ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ పీలా శ్రీకాంత్, ఈవో సుజాత, విశాఖజిల్లా రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీష్, అభివృద్ది కమిటీ సభ్యులు కొణతాల వెంకట రావు, మళ్ల సురేంద్ర, డాక్టర్ నారాయణరావు, ఆడారి జగన్నాధరావు, బిఎస్ఎంకే జోగినాయుడు, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీను, విష్ణుచౌదరి, కాంద్రేగుల సతీష్, మళ్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్లమారమ్మ తల్లి జాతర



అనకాపల్లి : మండలంలో సీతానగరం గ్రామంలో వెలసిన నలమారమ్మ తల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి గ్రామ ప్రజలు పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే అమ్మవారిని మాజీ మంత్రులు దాడి వీరభద్రారవు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే తనయుడు పీలా శ్రీకాంత్, ఎంపీ సోదరుడు ముత్తంశెట్టి మహేష్, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, అధికారులు దర్శించుకున్నారు. వీరికి సర్పంచ్ గంగుపాం రామలక్ష్మి, గంగుపాం మహేష్, సుంకర చంటి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదం అందజేసారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## రెండో విడత స్వచ్ఛీకరణ

గొలుగొండ : రెండవ విడత రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ కార్యక్రమం చేపడుతున్నామని తహసీల్దార్ పి.అంబేద్కర్ అన్నారు. మండలంలో మంగళవారం గుండుపాల గ్రామంలో రికార్డులు సాగులో ఉన్న రైతుల వివరాలు పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రెండవ విడతలో గుండుపాల, దారపాలెం, కొంగసింగి రెవెన్యూ గ్రామాల్లో రికార్డుల స్వచ్ఛీకరణ చేపడుతున్నామన్నారు. మొదటి విడతలో లింగందొరపాలెం, చీడికాడ, ఎర్రవరం, నాగందొరపాలెం, పిఎన్‌డిపాలెం, కొత్తపాలెం, జమ్మదేవిపేట రెవెన్యూలో రికార్డులు స్వచ్ఛీకరణ చేపట్టామన్నారు. ఆయా రెవెన్యూలో 810 రెవెన్యూ పరమైన సమస్యలు దరఖాస్తులు అందాయన్నారు.

# ఆదర్శవార్డుగా రూపొందించండి

- 47వ వార్డులో పర్యటించిన కమిషనర్ - వుడా కాలనీ, గుల్లలపాలెం, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీల సందర్శన
- ఇంటింటి నుండి చెత్త సేకరణ పట్ల సంతృప్తి - ఓపెన్ పోగులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- డ్రైయిన్ల మరమ్మత్తు, నిర్వహణ సక్రమంగా ఉండాలి - డెబ్రిస్, ఇసుక తొలగించండి

### - కమిషనర్ హరినారాయణన్



గాజువాక : జివియంసి కి చెందిన 47వ వార్డును ఆదర్శవార్డుగా రూపొందించాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన 47వ వార్డుకు చెందిన వుడాకాలనీ, గుల్లలపాలెం, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలను సందర్శించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణను పరిశిలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులో నాలుగు చోట్ల ఓపెన్ పోగులు ఉండడాన్ని గుర్తించి ఓపెన్ పోగులు లేకుండా చూడాలని ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీ మోహన్ ను ఆదేశించారు. డ్రెయిన్ల మరమ్మత్తు, నిర్వహణ పట్ల శ్రద్ధవహించాలని, డ్రెయిన్లలో చెత్తను, సిల్ట్‌ను తొలగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా వీధులలో పేరుకుపోయిన డెబ్రిస్, ఇసుకను తొలగించాలని ఏసిపి మధుసూచనరావును ఆదేశించారు. తొలుత ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో కొండవాలు మెట్ల మార్గం లో పేరుకు పోయిన చెత్తను తొలగించాలని, కాలువలను పరిశుభ్రం చేయాలని పేర్కొన్నారు. కాలనీలో తడి-పొడి చెత్తను ఇంటింటి నుండి చెత్త సేకరిస్తున్న కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజా మరుగుదొడ్లు, సులాభ్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు. మరుగుదొడ్లను మరింత పరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. తదుపరి మేన్‌హోల్స్ ఓపెన్ చేసి మురుగు లేకుండా చూడాలని కోరారు. అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులు, ప్రజారోగ్య అధికారులు విధులు నిర్వర్తించి స్వచ్ఛ విశాఖకు దోహదపడాలని పిలుపునిచ్చారు. పర్యటనలో నాలుగవ జోనల్ కమిషనర్ రమణమూర్తి, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీమోహన్, ఏసిపి మధుసూదనరావు, టి.పి.ఓ ఉమామహేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏ.ఇ రాధిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## డిఐజి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పట్టుబడ్డ గంజాయికి తూకం



నర్సీపట్నం : విశాఖ రేంజ్ డిఐజి శ్రీకాంత్ సమక్షంలో ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఆధ్వర్యంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన గంజాయిని తూకం వేసే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. 8వేల కేజీల గంజాయిని తూకం వేశారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.8 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఒక్క టౌన్ పరిధిలోని 85 కేజీలకు సంబంధించి 8 టన్నుల గంజాయిని పట్టుకున్నారు. అలాగే సర్కిల్ పరిధిలోని 45 కేసులకు సంబంధించి 14వేల కేజిల గంజాయిని పట్టుకున్నట్లు అంచనా వేశారు. మొత్తం సర్కిల్ పరిధిలో 22వేల కేజీల గంజాయిని పట్టుకున్నారు. భారీ నిల్వలు ఉన్న కారణంగా వాటిని అంచనా వేసి తూకం వేసి కోర్టు ఆదేశాల అనంతరం ఈ గంజాయిని తగులబెడతామని డిఐజి శ్రీకాంత్ తెలిపారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో డిఐజి మాట్లాడుతూ గంజాయి నిర్మూలనే ధ్యేయంగా విశాఖజిల్లా పోలీసులు పని చేస్తున్నారన్నారు. విశాఖజిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. దాదాపుగా గంజాయి నిర్మూలన జరుగుతుందని, కాకపోతే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గంజాయి నిర్మూలన అంతగా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామన్నారు. మహారాష్ట్ర, ఢిల్లి, తమిళనాడు వంటి ప్రాంతాల నుంచి గంజాయి స్మగ్లర్లు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. 30 ఏళ్ల తర్వాత గంజాయి రవాణా చేసే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం కొంత మంది గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నామన్నారు.

## యోగా కేంద్రం అభివృద్ధికి నిధులు బహూకరణ

### యోగా కేంద్రం ప్రయోగశాలల అభివృద్దికి 1.5 లక్షలు అందజేత

ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని చిట్టూరి శ్రావణి వర్సిటీ యోగా కేంద్రం ప్రయోగశాలల అభివృద్ధికి రూ1.5 లక్షలు బహూకరించారు.

మంగళవారం ఉదయం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావుకు రూ 1.5 లక్షలు డి.డిని అందజేశారు. చిట్టూరి శ్రావణి తన తండ్రి బొమ్మారెడ్డి రాంబాబు పేరుమీదుగా రూ లక్ష, తన తల్లి గిరిజా దేవి పేరుమీదుగా రూ 50వేలు అందించారు.

ఈ నిధులను యోగా కేంద్రంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రయోగశాలలు అభివృద్ధికి వెచ్చించాలని కోరారు.



**రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావుకు డి.డిని అందజేస్తున్న చిట్టూరి శ్రావణి**

వర్సిటీ అభివృద్ధికి నిధులను అందజేసిన పూర్వవిద్యార్థిని చిట్టూరి శ్రావణిని వర్సిటీ రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో కె.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

## భూమి రికార్డుల స్వచ్ఛీకరణలో మార్పులు గుర్తించండి

### ఆర్డీవో కె సూర్యారావు

నర్సీపట్నం : భూమి రికార్డుల స్వచ్ఛీకరణ సమయంలో ఆటో మ్యుటేషన్ ద్వారా జరిగిన మార్పులను గుర్తించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి కె.సూర్యారావు తాసిల్దార్‌లను ఆదేశించారు.

మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల స్వచ్ఛీకరణ పైసమీక్షా సమావేశం నిర్వహించారు. భూమి యొక్క వారసులు పూర్వీకులనుండి తమకు లభించిన భూములను తమ పేర మార్పు చేయవలసిందిగా కోరుతూ మీసేవలో దాఖలు చేసుకున్న 1667 దరఖాస్తులు ప్రకారం భూములు ఆటో మ్యూటేషన్ జరిగాయన్నారు. వాటిలో ఆక్షేపణ లేని వాటిని, తప్పుగా నమోదైన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి లెక్క తేల్చాలని ఆదేశించారు. దీనిపై సమర్పించిన నివేదికను జిల్లా కలెక్టర్ వారికి సమర్పిస్తామని, జాయింట్ కలెక్టర్ వారి అనుమతితో రికార్డుల స్వచ్ఛీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. డైగ్లాన్ ప్రకారం భూమి రికార్డు లను స్వచ్ఛీకరణ పూర్తి చేసేందుకు మండలానికి ఒక గ్రామాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. అడంగలు తో సరిచూస్తూ మెరక, పల్లం, జిరాయితీ, ప్రభుత్వ భూమి మొదలైన అంశాలను గుర్తించాలన్నారు. వీటి అన్నింటిపై సమగ్రమైన నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. రికార్డులను సరిచూడటం, భూమి పైకి వెళ్లి పరిశీలించి నివేదికను తయారు చేయాల్సిందిగా ఆదేశించారు.ఈ సమావేశంలో తహసీల్దార్లు పి.అప్పలనాయుడు వి.వి.రమణ, అంబేద్కర్, కనకారావు, వేణుగోపాల్, రాణి అమ్మాజీ, ఇన్‌ఛార్జ్ తహసిల్దార్‌లు భాస్కర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గీతం లో అట్టహాసంగా ప్రారంభం అయిన 'గుసాక్ కార్నివాల్'

## వందల సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు



సాగర్‌నగర్ : విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, పరస్పరం ఆలోచనలను పంచుకోవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి యువజనోత్సవం 'గుసాక్ కార్నివాల్-2018'' (గీతం యూనివర్సిటి సైన్స్ యాక్టివిటీ సెంటర్) మంగళవారం వందలాది మంది విద్యార్థుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభం అయింది. విద్యార్థుల సాంకేతిక ప్రదర్శనను వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. గీతం నుంచి ఎందరో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, మరికొందరు స్టార్టప్ కంపెనీలను ప్రారంభించారని వైస్-ఛాన్సలర్ తెలిపారు. 'గుసాక్' పేరిట గీతం లో నెలకొల్పిన విభాగానికి జాతీయ స్థాయి గుర్తింపు ఉందన్నారు. గౌరవ అతిధిగా హాజరైన



భారత ప్రభుత్వ మేదో హక్కుల పరిరక్షణ విభాగం డిప్యూటీ మేనేజర్ బిజయకుమార్ సాహెూ 'గుసాక్ కార్నివాల్-2018' విద్యార్థులు ప్రదర్శిస్తున్న పలు సాంకేతిక నమూనాలు పేటెంట్ హక్కులు పొందడానికి అర్హమైనవి ప్రశంసించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, సహాయ డైరక్టర్ డాక్టర్ ఎన్‌విఎస్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ అరుణలక్ష్మి, ప్రొఫెసర్ పి.షీలా తదితరులు పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న వర్క్‌షాప్‌లు, చర్చలు:**


గుసాక్-కార్నివాల్ -2018 లో భాగంగా మొదటి రోజు ఆకట్టుకునే విధంగా చర్చలు, వర్క్‌షాప్‌లు నిర్వహించారు. వివిధ సంస్థలకు చెందిన మానవ వనరుల విభాగం నిపుణులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'రోబోలు భారత యువత భవిష్యత్తు' అనే చర్చా కార్యక్రమం ఆసక్తిగా సాగింది. ప్రపంచంలో ప్రపంచంలో అధిక సంఖ్యలో యువత గల భారతదేశంలో కంపెనీలు ఆటోమేషన్, కృత్రిమ మేధను ఆశ్రయిస్తే నిరుద్యోగం పెరుగుతుందన్న వాదనతో పాటు రోబోలు వినియోగించే పరిస్థితి వస్తే నూతన చట్టాలు, నియంత్రణ చర్యలు అవసరమని సూచనలు విద్యార్థులు చేశారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫోటోగ్రాఫర్లలో ఒకరయిన ఆదిత్య వెంకటేష్ చిన్న కెమెరాలతో సైతం అద్భుత చిత్రాలను ఎలా తీయవచ్చో తెలియజేశారు. క్రౌడ్ సోర్సింగ్‌పై గూగుల్ సంస్థ ప్రతినిధి మొహమ్మద్ నవాజుద్దీన& ఆసక్తి కర విషయాలను తెలియజేశారు.

# విజయభాను సంపాదకీయం

## అణు విద్యుత్‌పై మంచిదా? కాదా?

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యూల్ మాక్రాన్ నాలుగు రోజుల భారత పర్యటన రెండుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసింది. వ్యాపారవేత్తలు, అధికారులతో కూడిన భారీ పరివారంతో వచ్చిన మాక్రాన్‌కు ప్రధాని మోదీ తన సహజశైలిలో గాఢాలింగనంతో స్వాగతం పలికినప్పుడే, ఈ మైత్రి ఎంత పటిష్టమైనదో తెలిసిపోయింది. మాక్రాన్ ఈ పర్యటనలో 16 బిలియన్ డాలర్ల మేర 14 ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రక్షణ రంగం, భద్రత, అణు ఇంధనం మొదలైన భిన్న రంగాల్లో ఈ ఒప్పందాలు కుదిరాయి. బ్రిటన్‌తో ఉన్న చారిత్రక సంబంధాలను మినహాయిస్తే, ఒక పశ్చిమ యూరోపియన్ దేశంతో ఇంత బలమైన అనుబంధం మరే దేశంతో కూడా ఏర్పడి ఉండదు. సాధారణంగా యూరోపియన్ సమాజాలు భారత్‌ను సహజ మిత్రదేశంగా భావిస్తుంటాయి. ఇక్కడి ఉదారవాద ప్రజాస్వామిక వ్యవస్థ, లౌకిక స్వభావం వల్ల సాన్నిహిత్యం పెంచుకోవడం తేలిక. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను పెంచాలని ఇరువురు నాయకులు భావిస్తున్నారు. భారతీయ విద్యార్థులు యూరప్‌లో ప్రవేశించడానికి తమ దేశం వచ్చి చదువుకోవలసిందిగా చదువుకోవచ్చని మాక్రాన్ ఈ సందర్భంగా ఆహ్వానించారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, అంతరిక్షం మొదలైన రంగాలలో విస్తృతంగా సంబంధాలు నెలకొల్పుకోవాలనే భావన రెండు దేశాల్లో ఏర్పడ్డది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలిగిన తర్వాత, ఈయూను ఫ్రాన్స్- జర్మనీ కూటమి ముందుండి నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ ప్రాధాన్యమిస్తున్నది. భారత్ చుట్టూరా దేశాల్లో చైనా పాగా వేయడం, హిందు మహాసముద్రంలో పోటాపోటీగా ఉండటం వల్ల భారత్ ఫ్రాన్స్‌తో సైనిక వసతుల ఉపయోగంపై ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే అమెరికాతో ఉన్న అవగాహనకు అదనంగా ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం భద్రతారీత్యా కీలకమైంది. భారత్, ఫ్రాన్స్ ఒప్పందం ప్రకారం- ఒక దేశ సైనిక వసతులను మరోదేశం ఉపయోగించుకోవచ్చు. ఇందులో భాగంగా నావికా వసతులను యుద్ధ నౌకలు వాడుకోవచ్చు. హిందు మహా సముద్ర ప్రాంతంలో ఫ్రాన్స్‌కు రెండు దీవుల్లో స్థావరాలు ఉన్నాయి. ఇవి భారత్‌కు అందుబాటులోకి వస్తాయి. దీంతోపాటు భారత వసతులు ఫ్రాన్స్‌కు ఉపయోగపడుతాయి. ఇటీవల మాల్దీవులలో సంక్షోభం ఏర్పడటం, చైనా తమ నౌకలను అక్కడికి పంపి, భారత్‌కు పరోక్ష హెచ్చరికలు చేయడం గమనార్హం. హిందు మహాసముద్రం మొదలుకొని పసిఫిక్ ప్రాంతం వరకు చైనాకు పోటీగా భారత్‌కు మద్దతు ఇవ్వాలనేది ఫ్రాన్స్ విధానం. మాక్రాన్ పర్యటన సందర్భంగా ఇంధన రంగంలో సహకారం కూడా చర్చకు వచ్చింది. అంతర్జాతీయ సౌరకూటమి వార్షిక సమావేశంలో మాక్రాన్ ప్రసంగించారు. భవిష్యత్తులో సౌరవిద్యుత్ కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో భారత్, ఫ్రాన్స్ గతేడాది పలు దేశాలను కలుపుకొని ఈ కూటమి ఏర్పాటు చేశాయి. వాతావరణ మార్పులను అరికట్టాలనే లక్ష్యంతో కుదిరిన ప్యారిస్ ఒడంబడిక నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత, పర్యావరణ పరిరక్షణ విషయమై భారత్, ఫ్రాన్స్ ఉమ్మడిగా కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సౌర కూటమి ఏర్పాటు కీలకమైనది. భూమధ్య రేఖకు కర్కటక రేఖకు మధ్య ఉండి సూర్యతాపం అధికంగా పొందే దేశాల్లో ఒకటైన భారత్ భవిష్యత్తులో సౌర విద్యుత్ ద్వారా లబ్ధి పొందవచ్చు. అందువల్ల ఈ రంగంలో భాగస్వామ్యం భారత్‌కు ఉపయోగపడుతున్నది. సౌర విద్యుత్‌ను మరింత లాభదాయకంగా ఉత్పత్తి చేయడం, నిలువ చేసుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. సౌర విద్యుత్ రంగంలో ఫ్రాన్స్‌తో భాగస్వామ్యం వరకు ఇబ్బంది లేనప్పటికీ, అణు విద్యుత్ కేంద్రం విషయంలోనే వివాదం ఉన్నది. ఫ్రాన్స్ సహకారంతో మహారాష్ట్రలోని జైతాపూర్‌లో నిర్మించతలపెట్టిన అణు విద్యుత్ కేంద్రం ప్రపంచంలోనే పెద్దది అవుతుంది. అణు విద్యుత్ ఉత్పత్తిలో ఫ్రాన్స్ ప్రపంచంలోనే గణనీయమైనది. ఈ దేశ ఇంధన అవసరాలలో నలభై శాతం అణు విద్యుత్ ద్వారానే తీరుతుంది. గృహావసరాలకు విద్యుత్‌ను అతి చౌకగా అందించే దేశంగా ఫ్రాన్స్ పేరు తెచ్చుకున్నది. అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో ఫ్రాన్స్ అనుభవం, పాటవం కాదనలేనిది. కానీ ఇటీవలి కాలంలో అణు విద్యుత్ కేంద్రాలు ప్రమాదకరమనే స్పృహ పెరిగింది. జర్మనీ వంటి దేశాలు క్రమంగా అణు విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నాయి. అందువల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలు అణు విద్యుత్‌పై మొగ్గు చూపడం మంచిదా అనే ప్రశ్న తలెత్తుతున్నది. రాఫెల్ ఒప్పందం విషయంలో అవినీతి చోటు చేసుకుందని మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని పొడిగించడం సబబు కాదు. మొదట అంగీకరించిన 36 రాఫెల్ జెట్స్ పొందిన తర్వాత, తదుపరి దఫా 36 జెట్స్‌కు కూడా భారత్ అంగీకరించిందన్నారు.

## కోహ్లీ ఇచ్చిన బ్యాట్‌తోనే ఆడతా



దిల్లీ: ఇంగ్లాండ్ మహిళా క్రికెటర్ డేనియెల్లి వాట్ గుర్తుండే ఉంటుంది కదా. అదేనండి 2014లో మన పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీకి ట్విటర్ ద్వారా పెళ్లి ప్రపోజల్ చేసింది తనే. ఇప్పుడు ఆమె గురించి ఎందుకంటే.. త్వరలో ముక్కోణపు టీ20 సిరీస్ కోసం ఇంగ్లాండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. భారత్‌కు వచ్చే ఇంగ్లాండ్ జట్టులో డేనియెల్లి సభ్యురాలు.

2014లో టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై కోహ్లీ ప్రదర్శన చూసిన డేనియెల్లి పీకల్లోతు ప్రేమలో పడిపోయింది. దీంతో ట్విటర్ వేదికగా కోహ్లీ నన్ను పెళ్లి చేసుకో అని ప్రపోజల్ కూడా చేసేసింది. అదే ఏడాది టీమిండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. అప్పుడు డెర్బీషైర్‌లో భారత్-ఇంగ్లాండ్ మధ్య జరిగిన వార్మప్ మ్యాచ్‌కు వచ్చింది డేనియెల్లి. మ్యాచ్ అనంతరం కోహ్లీని కలిసింది. ఫొటో కూడా దిగింది. ఈ సందర్భంగా కోహ్లీ తన దగ్గర ఉన్న ఒక బ్యాట్‌ను కానుకగా డేనియెల్లికి బహుకరించాడు. కోహ్లీతో దిగిన ఫొటోలను, బ్యాట్‌ను కూడా డేనియెల్లి అప్పట్లో ట్విటర్ ద్వారా పంచుకుంది.


ముక్కోణపు సిరీస్ కోసం భారత్ రానున్న డేనియెల్లి తాజాగా మీడియాతో మాట్లాడింది. భారత పర్యటనలో నేను కోహ్లీ ఇచ్చిన బ్యాట్‌తోనే ఆడతాను. ఎందుకంటే నేను వాడే బ్యాట్ విరిగిపోయింది అని తెలిపింది. భారత్-ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా మధ్య జరగనుంది. ఆ తర్వాత మార్చి 25న భారత్.. ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

## స్వీట్లు పంచుతున్న సుందరి... చూసేందుకు జనం బారులు




సియోల్: సోషల్ మీడియాలో ఇటీవల కొరియాకు చెందిన ఒక యువతి ఫొటో వైరల్‌గా మారింది. దక్షిణ కొరియాకు చెందిన ఈమె ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారిపోయింది. ఈ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి స్వీట్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అయితే అతని వ్యాపారం అంతగా సాగడంలేదు. దీంతో దీనిని అమ్మేయాలని అనుకున్నాడు. దుకాణం అమ్మేసేముందు అతని మనసులో ఒక ఐడియా వచ్చింది. వెంటనే దానిని అమలు చేశాడు. దుకాణంలో ఒక అందమైన యువతిని నియమించుకున్నాడు. ఈ వార్త ఈ నోటా, ఆ నోటా అంతటా పాకిపోయింది. ఇంకేముంది... కనువిందు చేస్తున్న ఆ సుందరిని చూసేందుకు అతని దుకాణం ముందు జనం బారులుతీరసాగారు. పైగా ఆమె మార్కెటింగ్ స్కిల్స్‌కు ముగ్ధులైన వినియోదారులు తరచూ దుకాణానికి రావడం ప్రారంభించారు. ఇలా ఆమెకు విపరీతంగా ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగిపోయింది. చివరకు ఫిల్మ్ మేకర్స్ ఆమెకు సినిమాల్లో ఆఫర్లు ఇస్తున్నారట.

## కేజ్రీవాల్ సలహాదారు రాజీనామా



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు షాక్ తగిలింది. ఆయన వ్యక్తిగత సలహాదారుడు వీకే జైన్ తన పదవికి రాజీనామా చేశారు. జైన్ తన రాజీనామా లేఖను సీఎంవో కార్యాలయానికి, లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి పంపారు.

వ్యక్తిగత కారణాల వల్ల తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు తన రాజీనామ లేఖలో పేర్కొన్నారు. అయితే ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాశ్‌పై దాడి కేసులో జైన్ సాక్షి ఉండటంతో ఆయన రాజీనామా వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు రెండురోజుల క్రితమే జైన్‌ను సీఎస్ దాడి వ్యవహారంలో పోలీసులు విచారించారు కూడా.

కాగా, గతనెల 22వ తేదీన ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ అన్షు పై ఆప్ ఎమ్మెల్యేలు అమానుతుల్లా ఖాన్, ప్రకాశ్ జార్వల్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తాను అక్కడే ఉన్నానని.. ఎమెల్యేలు దాడి చేయటం చూశానని విచారణలో జైన్ తెలిపారు. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి సీఎం కార్యాలయానికి దూరంగా ఉంటున్న జైన్.. హఠాత్తుగా రాజీనామా చేయటం విశేషం. ఇప్పటికే వరుస ఆరోపణలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు.. ఇప్పుడు జైన్ రాజీనామా దిగ్భ్రాంతికి కలిగించేదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## ఒత్తిడితో చిత్తవుతున్న యువత

లండన్ : జీవితమంతా బతుకు పోరాటంతో సతమతమయ్యే సామాన్యులు ఎంతటి ఒత్తిడితో చిత్తవుతారో ఓ అధ్యయనం వెల్లడించింది. 25 - 35 ఏళ్ల యువత ప్రతి పది మందిలో ఆరుగురు డబ్బు, జీతం, జీవితాన్ని ఈదడం ఎలా అనే ఆలోచనలతో కుంగిపోతున్నారని పరిశోధనలో తేలింది.

సగం మందికి పైగా యువత రోజువారీ ఖర్చులను అధిగమించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇక ప్రేమలో విజయం సాధించేందుకు, సవాల్‌తో కూడిన ఉద్యోగాన్ని నిలబెట్టుకునేందుకు ఒత్తిడికి లోనవుతున్నారని వెల్లడైంది. గత ఆరు నెలలుగా మీరు ఎలా ఉంటున్నారన్న ప్రశ్నకు తాము తీవ్ర ఆందోళన, గాబరా, గందరగోళం, తీవ్ర విచారంగా ఉంటున్నామనే సమాధానం అతిసాధారణంగా వారి నుంచి వ్యక్తమైందని ఫస్ట్ డైరెక్ట్ బ్యాంక్ కోసం నిర్వహించిన అధ్యయనం తెలిపింది.

ఆర్థిక ఇబ్బందులు, జీవనశైలి, సవాల్‌తో కూడిన ఉద్యోగాలు, శృంగారం కొరవడటం, తల్లితండ్రులతో సంబంధాలు, సోషల్ మీడియా, స్థిరాస్తిని సమీకరించుకోవడం వంటి అంశాల్లో తీవ్ర ఒత్తిడి ఎదురవుతోందని అధ్యయనం తేల్చిచెప్పింది. కాగా యువత ఒత్తిడి,

భవిష్యత్‌పై భయంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని సైకాలజిస్ట్ డాక్టర్ ఒలివర్ రాబిన్సన్ అధ్యయన వివరాలను విశ్లేషించారు.

## కవి సమయం

### 'జీవన ప్రయాణం'

కలసి మెలసి మెలుగుదాం
చేయి చేయి కలుపుదాం
కలుపుగోరు జీవితాలు గడుపుదాం.
అన్ని వున్న భారతావనిలో...
పుణ్యమైన పుడమిన పుట్టినాం;
శ్రమ జీవన సాధనలో...
కలిమి గలిగి యెదుగుదాం.
కరువు పెరిగి బుఱ్ఱన
బరువు బుట్ట యెలాన?
ధరలు అదుపు చేయాలోయ్
పాలన అని పించాలోయ్
మాటలతో కోటలు కావు
గాంధీబాబు చెప్పిందినవోయ్;
పల్లె, పేట పాటులతో...
నిండివున్న నవ్వులతో...
నిక్కచ్చి స్వరాజ్య మోనోయ్

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512


## పంచాంగం

మాసం : ఫాల్గుణ ; తిథి: ద్వాదశి మ.3.04; శ్రవణం మ.2.37; సా.వ.6.57ల 8.41.

బుధవారం 14-03-2018

a **మేషం** : ప్రియతములతో విరామ కాలక్షేపాలతో పాల్గొంటారు. కపటం లేని మీ ఆలోచనలు, సలహాలు మీకు అభిమానుల్ని సంపాదించి పెడుతుంది. ఇంటా బయటా సమస్యలు తలెత్తినా తెలివితో పరిష్కరిస్తారు. రవాణా వ్యవ హారాల్లో ఆచితూచి వ్యవహరించండి. b **వృషభం** : విదేశీ యత్నాలలో కొన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధిస్తారు. వ్యాపారాభివృద్ధికి కొత్త కొత్త ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. విలాస వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. రుణ విముక్తులు కావాలనే మీ ఆలోచన ఫలిస్తుంది. సోదరీ, సోదరులతో కలహాలు తలెత్తుతాయి. c **మిథునం** :రవాణా రంగాల వారికి ప్రయాణీకులతో ఇబ్బందులను ఎదుర్కొంటారు. డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్సలను సమర్థంగా పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. పెద్దల ఆరోగ్యములో మెళకువ అవసరం. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసు కుంటారు. d **కర్కాటకం** : రాజకీయ నాయకులకు మంచి పేరు, ఖ్యాతి లభి స్తుంది. రవాణా వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించండి. స్త్రీలకు తలపెట్టిన పనిలో ఆటంకాలను ఎదుర్కొంటారు. అనవసరపు సంభాషణ వల్ల సహోద్యోగులతో ఆకస్మిక భేదాభిప్రాయాలు తలెత్తే ఆస్కారం ఉంది. ప్రముఖుల కలయికతో పనులు పూర్తవుతాయి. e **సింహం** : ఇతరులను ధనసహాయం అడగటానికి అభిజాత్యం అడ్డువస్తుంది. వృత్తుల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. పెద్దల ఆరో గ్యం గురించి ఆందోళన చెందుతారు. ఉద్యోగస్తులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. షాపు గుమాస్తాలు, అకౌంట్లకు ఒత్తిడి, పనిభారం అధికం. f **కన్య** : బ్యాంకు పనులు మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. కుటుంబీకుల కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. పోస్టల్, టెలిగ్రాఫ్, కొరియల్ రంగాలవారికి శ్రమాధిక్యత. జూదాల్లో ధననష్టం, చికాకులు ఎదుర్కొంటారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం ఆలో చన విరమించుకోవడం మంచిది. g **తుల** : చిన్ననాటి వ్యక్తుల కలయిక సంతోషం కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల పనివారికి ఒత్తిడి, చికాకులు వంటివి అధిక మవుతాయి. గతంలో నిలిపి వేసిన వ్యాపారాలు, పనులు పునః ప్రారం భించేందుకు చేయు యత్నాలు కలిసివస్తాయి. కోర్టు వ్యవహారాలు అను కూలిస్తాయి. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. h **వృశ్చికం** :ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంహంలో చికాకులు తొలగిపోయి మానసిక ప్రశాంతత నెలకొంటుంది. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. రాజకీయ నాయకులకు ఊహించని మార్పులు చోటుచేసుకుంటాయి. i **ధనుస్సు** : ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. లౌక్యంగా పనులు చక్కబెట్టుకోవాలి. ఆస్తి, స్థల వివాదాలు కొలిక్కివస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో కొత్త ఉత్సా హం చోటుచేసుకుంటుంది. విద్యార్థులకు తోటివారి కారణంగా చికాకులు తప్పవు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పోటీతత్వము పెరుగుతుంది. j **మకరం** : ఆదాయ వ్యయాలకు ఏమాత్రం పొంతన ఉండదు. మీ మాటే నెగ్గాలనే పట్టుదల మంచిది కాదు. స్త్రీలకు ఆరోగ్యంలో చిన్న చిన్న చికాకులు తలతెత్తగలవు. జాగ్రత్తలు అవసరం. బ్యాంకు వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రైవేట్ సంస్థల్లోని వారు తోటి వారితో స్నేహ భావంతో సంచరిస్తారు. k **కుంభం** :మీ శ్రీమతి వైఖరిలో మార్పు సంతోషం కలిగిస్తుంది. ఆత్మీయుల రాకతో గృహం కళకళ లాడు తుంది. ప్రయాణాల్లో ఊహించని చికాకులను ఎదురవుతాయి. నిరుద్యోగు లకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. కొబ్బరి పండ్ల పూల వ్యాపారులకు కలిసి రాగలదు. L **మీనం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. రావలసినధనం అనుకోకుండా చేతి కందుతుంది. విద్యార్థులు అనవసర భయాందోళనలు విడనాడి శ్రమించినట్లైతే జయం పొందగలరు.

# మహిమాన్వితం... శివగంగ ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గంగమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాద్భుతమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ.. భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. కాక తీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడే స్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తే శ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమృతే శ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్ట కామే శ్వరుడు, శ్రీముకే శ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణి కర్ణికే శ్వరుడు, శ్రీమహా నందీశ్వరుడు, శ్రీఅమరావతీ శ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆల యాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహాజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన


## సంకీర్తన

కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ అర్చిలతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అద్భుతంగా నిర్మించారు.ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విష్ణు భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది.

1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## నిరుపేదలకు
# ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని ఆందోళన


ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : లోక్‌జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు రాజాన వీర.సూర్యచంద్ర ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని, ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయాలని, జిల్లేడుపూడి గ్రామ పంచాయతీ శివారు వై.వెంకయ్యపాలెం గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నంలో ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గల నిరుపేదలను గుర్తించి, అర్హులైన వారికి సొంత గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో లబ్ధిదారునికి 2 సెంట్ల ఇళ్ల స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. అదే విధంగా పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నాతవరం మండలం జిల్లేడిపూడి గ్రామ పంచాయతీ శివారు వై.వెంకయ్య పాలెం గ్రామంలో శ్మశాన వాటిక ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నిరుపేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 17న ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉగాది సంబరాలు

విశాఖపట్నం : ఈనెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సూర్యాబాగ్‌లోని వైశాఖి జల ఉద్యా నవనంలో శ్రీ విళంబినామ సంవత్సర ఉగాది సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగరశాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.నారాయణ్, ఎస్.అనూరాధ, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ నగర అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావులు తెలియజేశారు. శనివారం ఉదయం 9 గంటలకు ఈ సంబరాలు మొదలవుతాయని నిరంతరం మానసిక ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆట విడుపుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడీప్, పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం అర్బన్, రూరల్ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో ఈ సంబరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతీఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉగాది సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు పంచాంగాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# ఘనంగా భరణికం పరిదేశమ్మ పండుగ



పరవాడ:పరవాడ మండలము భరణికం గ్రామంలో మంగళవారము పరిదేశమ్మ పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు వేకువజాము నుండే అలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు పైలజగన్నాధరావు, భరణికం సర్పంచ్ బొండాతాతారావు, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అధీప్ రాజు, వైసీపీ పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైల శ్రీనువాసురావు, పరవాడ సర్పంచ్ చుక్కరాము నాయుడు, భరణికం ఉప సర్పంచ్ దాట్ల బంగారుమణి, దాట్ల గణేష్ రాజు, మండల వైసీపీ యూత్ అధ్యక్షులు పెదిశెట్టిశేఖర్ ,పరవాడ ఎంపిటిసిసభ్యులు సిరపురపు అప్పలనాయుడు, గొర్లివానిపాలెం ఎంపిటిసిసభ్యులు, డాక్టర్ గొర్లి శ్రీనువాసు రావు, మండల టీడీపీ ప్రెసిడెంట్ బొండాసన్నిదేముడు, బుగిడి గోవింద తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము వాలీబాల్ ,బాల్ బ్యాట్మంట్ పోటీల్లో గెలి పొందిన విజేతలుకు బహుమ తులును అందజేశారు. అనం తరము సాయంత్రము కొలా టములు, చిటికలుభజనలు, ప్రజ లను ఎంతగానో అకట్టు కున్నాయి. మహిళలు మరియు అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కోసం వైకాపా విద్యార్థి విభాగం
# పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన

భీమునిపట్నం : వైకాపా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక బీచ్ పార్క్ లో వున్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. విశాఖపట్నం కు రైల్వే జోన్ విషయం లో రోజు కొక ప్రకటన చేస్తూ విశాఖ ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రత్యేక హోదా, విశాఖ పట్నం కు రైల్వే జోన్ ఇచ్చేవరకూ ఇలాంటి నిరసన ప్రదర్శనలు చేస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి కైనా మాట మార్చకుండా ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విశాఖ కు రైల్వే జోన్ లు ఇవ్వాలని ఆయన కోరారు . ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంకి వెంకటేష్, భీమిలి పట్టణ రూరల్ అధ్యక్షుడు గరికిన వెంకట్, కొయ్య రామకృష్ణ .భి.మోహన్, కె,మురళి,విద్యార్థి విభాగం సభ్యులు పాల్గొన్నారు.




# తగరపువలసలో రైతుబజార్ నిర్మాణానికి స్థల పరిశీలన



భీమునిపట్నం : తగరపువలస డివిజన్ లో రైతుబజార్ నిర్మాణానికి స్థలంను పరిశీలించారు.అలాగే భీమిలి లోకూడా రైతు బజార్, చేపల మార్కెట్ లను కూడా పరిశీలన చేశారు. ఇందులో గంటా ప్రతినిధి చిక్కాల విజయబాబు, ప్రత్యక అధికారి శ్రీనివాస్ ,భీమిలి జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, వుడా ఎస్. ఈ, తగరపువలస భీమిలి డివిజన్ టి.డి.పి పార్టీ అద్యక్షులు కొప్పల. రమేష్, గంటా నూకరాజు, కొప్పల కృష్ణ, రవ్వ వెంకటరావులు పాల్గొన్నారు.

# భరణికంలో జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

పరవాడ:పరవాడ మండలము భరణికం గ్రామంలో పరిదేశమ్మ పండుగ సందర్భంగా జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలును ఏర్పాటు చేశారు. ఈ పోటీలను మంగళవారము పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారుఅప్పలనాయుడు, జిల్లాప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు చేతులు మీదగా ప్రారంభించారు. అనంతరము వాళ్ళు మాట్లడుతూ క్రీడలుమానశిక ఉల్లాశంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంచుకోవాడానికి తోడ్పతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండాతాతారావు, దాట్లగణేష్ రాజు, బొండా సన్నిదేముడు, గొర్లివానిపాలెం ఎంపిటిసి గొర్లి శ్రీనువాసు రావు, పెదిశెట్టి సత్యారావు, బుగిడి గోవింద తదితరులు పాల్గొన్నారు.





11వవార్డులో రాయుడు పద్మ అక్కా రాయుడు నాగలక్ష్మి. ఆనారోగ్యానికి లోనై కెజిహెచ్‌లో చనిపోయారు అందుకు ప్రధాన మంత్రి - చంద్రన్న భీమా రూ 2,00000/- చెక్కును భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు శ్యామల దీపికా అందజేశారు. శ్యామల దీపికా మాట్లాడుతూ మీకు ఎటువంటి అవసరమ్తైన కార్యాలయంకి రావల్సిందగా కోరారు.

## భార్య ఉండగా
# రెండో పెళ్లి చేసుకున్న భర్త

భీమునిపట్నం : తగరపువలస భార్య ఉండగా భర్త రెండో పెళ్లి చేసుకున్న సంఘటన తగరపువలస దగ్గర టి. నగరపాలెంలో జరిగింది. భీమిలి ఎస్.ఐ. పి.శ్రీనివాసరావు ఇచ్చిన వివరాలు ప్రకారం బర్ల నర్సింగరావు, అరుణలకు పదేళ్ళక్రితం వివాహమయ్యింది. కాగా వీరికి షర్మిల, ఇమేష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఈనెల 8వ తేదీన గుడివాడ దగ్గర చెరుకుపిల్లికి చెందిన యువతి ని మొదటి భార్యకు తెలియకుండా వివాహం చేసుకున్నాడు. కాగా విషయం తెలుసుకున్న అరుణ భీమిలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే నర్సింగరావు ను ఎస్.ఐ శ్రీనివాసరావు ను కారణం అడగ్గా అరుణ లావుగా ఉండడంతో రెండో పెళ్లి చేసుకున్నట్లు చెప్పడంతో అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. ఈవిషయంపై ఎస్ఐ ని వివరణ కోరగా అరుణ కుటుంబ సభ్యులు రాజీ కుదిర్చి తరువాత సఖ్యత కుదిరినట్లయిన పర్వాలేదు లేకపోతే స్టేషన్ కు తీసుకొస్తామని చెప్పినట్లుగా తెలిపారు.

## నూకాలమ్మ గుడిలో
# సిసి కెమెరాలు

భీమునిపట్నం : భీమిలి నూకాలమ్మ ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి దేవాలయము లో నాలుగు సి.సి. కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుండి 18 వరకూ అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసారపు నాగరాజు మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఉత్సవాలకు వేలాదిమంది విచ్చేసి అమ్మవారిని దర్శించు కుంటారని. ఈ ఏడాది తొలిసారిగా ప్రవేశ పెట్టిన మాలాదారణ కార్యక్రమంకు మంచి స్పందన లభించిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం కు ఆలయ ఈఓ కీర్తి.శ్రీనివాసరావు ,ఎండోమెంట్ గుమస్తా పి. రాజు ఆలయ పూజారులు చౌదరి సత్యరాజ్,చౌదరి వెంకటేష్, పాల్గొన్నారు.

## గిరిజనుల అదృశ్యంపై
# ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు

రావికమతం : గిరిజనుల అదృశ్యంపై కేసు నమోదుకు నిరాకరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని జెడ్.జోగుంపటే గ్రామానికి చెందిన పాంగి చంద్రన్న పాడేరు ఐటిడిఎ పిఒకు రవి సుభాష్‌కు ఫిర్యాదు చేశారు. జెడ్.జోగుంపేట, ఆర్ఆర్‌పురం గ్రామాలకు చెందిన ఐదుగురు గిరిజనులను తెలంగాణలోని వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని వొలుసుపల్లి ఆడ్డాకుల వద్ద మట్టి పనులు చేయడానికి నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ కృష్ణంరాజు ఒప్పందంపై గత నెల 27న తీసుకువెళ్లారు. అదే గ్రామానికి చెందిన గిరిజనుడు శంకర్ తుని రైల్వేస్టేషన్ వరకూ వారిని తీసుకువెళ్లి కాంట్రాక్టర్కు అప్పగించారు. ఇందులో పాంగి బాబ్జి(57), మాలపర్తి రామయ్యదొర పనులకు వెళ్లలేదని కాంట్రాక్టర్, శంకర్‌కు ఫోన్ చేశారు. దీంతో గ్రామ పెద్ద చంద్రయ్య పని ప్రదేశానికి వెళ్లి తప్పిపోయిన వారి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. వారు కేసు నమోదుకు నిరాకరించడంతో తిరిగి ఇంటికి చేరుకొని కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అక్కడ కూడా కేసు నమోదు చేయకపోవడంతో ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేశారు.

## ఏరియా ఆసుపత్రిలో
# సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ఏర్పాటు


సుధాశారదాతో మాట్లాడుతున్న దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు నర్సీపట్నం శ్రీ రామాంజనేయ బట్టల షాపు యాజమాని రాము చొరవ చూపించారు. ఇప్పటికే ఆయన ఎమర్జెన్సీ వార్డులో రూ.80వేలతో ఈ ఆక్సిజన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించారు. ఇందుకు సంబంధించి రూ.80వేలను ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుధాశారదాకు మంగళవారం అందజేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ సుధాశారదా కోరిక మేరకు ఎన్‌బిసియు చైల్డ్ యూనిట్ గదిలో, గర్భిణీల ఆపరేషన్ థియేటర్‌లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామని రాము తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ చైర్మన్ మాకిరెడ్డి అప్పారావు, రుత్తల అప్పారావు, బోళెం వెంకటరమణ, రుత్తల శ్రీనివాసరావు, హెడ్ నర్సులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# రుద్ధ్రభూమి ఆక్రమణపై తహసీల్ధార్‌కు ఫిర్యాదు

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో సోమలింగపాలెం రుద్రభూమి ఆక్రమణకు గురవుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అప్పలరాజుకు వైసిపి నియోజవర్గ సమన్వయకర్త బడ్డేడ ప్రసాద్ ఫిర్యాదు చేశారు. గత కొన్నేళ్లుగా పిల్లలు, మహిళల కోసం ఏర్పాటు చేసిన రుద్రభూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఆక్రమణ జరగకుండా చూడాలని ప్రసాద్‌తో పాటు బోడెపు గోవింద్, పడాల శ్రీను కోరారు.

## బాలల సంక్షేమంపై
# మూడురోజులు పాటు శిక్షణా తరగతులు



సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం వారు బాలల సంక్షేమ మరియు మహిళా సంక్షేమ, యునిసెఫ్ సంయుక్తంగా కొత్తగా నియమితులైన సంక్షేమ సమితి ఛైర్‌పర్సన్ మరియు సభ్యులకు (25 మంది) 3రోజుల పాటు ఇచ్చే శిక్షణా తరగతులు బుధవారం మొదలైనవి. ఈ శిక్షణా కార్య క్రమంలో బాలల న్యాయం (బాలల పోషణ, రక్షణ) చట్టం 2015, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణా చట్టం -2012 సంబంధించి బాలల సంక్షేమ సమితీ గల విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎ.ఎల్.క్రిస్మత్ కుమార్, డైరక్టర్ ఆఫ్ జువెనైల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ (రిటైర్డ్) డేవిడ్‌రాజు, యునిసెఫ్ మరియు సత్య నారాయణ, తిరుపతిరావు, ఛైల్డ్ ప్రొటెక్షన్ మేయర్ గుంటూరు తదితరులు పాల్గొన్నారు. మునుపు మార్చి 6,7,8 తేదీలలో మొదటి విడతగా 30 సభ్యులను మరియు ఇప్పుడు 13,14,15 తేదీలలో రెండవ విడతగా మిగిలిన సభ్యులకు శిక్షణా కార్యక్రమంను ఏర్పరిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా వర్సిటీ ఉప కులపతి డా.వి.కేశవరావు, రిజిస్ట్రార్ డా.దయానందమూర్తి, డీన్ రీసెర్చ్ అండ్ అకడమిక్ ఆఫర్స్ డా.పి.శ్రీదేవి, బాలల కేంద్రం సమన్వయకర్తలు విజయలక్ష్మి, అరవింద త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల ఫంక్షన్ హాల్ ఫ్రీ
సెంట్రల్ ఏసీ
హోటల్ అరిటాకు ఏస వారిచే
ఎన్.ఎ.డి. జంక్షన్, వైజాగ్.
అతి తక్కువ రేట్లకే క్యాటరింగ్ & హాస్టల్స్
ఆఫీస్‌లకు ఫుడ్ సప్లయ్ హోటల్‌లో రూ. 79/-లకే
30 రకాల ఐటమ్స్‌తో విందు భోజనం
72889 99970

పాసుపుస్తకం
పడిపోయినది
మా తండ్రి మేడపాటి సత్యనారాయణరెడ్డి గారి పేరున ఆత్రేయపురం మండలం, మెర్లపాలెంలో సర్వే నెం.125-1,2, 155-4, 156-4, 155-7ర్లులో య3-32ట్లు వ్యవసాయం భూమి కలదు. సదరు భూమికి మా తండ్రి గారి పేరున 234257 నెంబరు గల టైటిల్ డీడ్ ది.23-01-2018 న ఊబలంకలో జిరాక్సు తీయించుటకు వెళ్ళుచున్న సమయంలో ఎక్కడో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలుపగలరు.
మేడపాటి శ్రీరామారెడ్డి,
తండ్రి: సత్యనారాయణరెడ్డి,
డోరు నెం.1-2/2, ఊబలంక,
రావులపాలెం మండలం.
సెల్ నెం.9640901268

## అవార్డుల కోసం
# ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలి

నాతవరం : ఉపాధ్యాయ అవార్డుల కోసం మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల తమ దరఖాస్తులు ఈ నెల 14వ తేదీ లోగా ఎంఇఒ కార్యాలయానికి పంపించాలని ఎంఇఒ అమృతకుమార్ కోరారు. 15ఏళ్లు పూర్తి చేసిన వారు 20 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి హెచ్‌ఎంలు వెంటనే దరఖాస్తులు అందించాలన్నారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డుకు అర్హులను గుర్తించి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సత్కరించడానికి నిర్ణయించారన్నారు. ఈ నెల 15లోగా ఉపాధ్యాయులు తమ వివరాలు డిఇఒ కార్యాలయానికి కూడా పంపించవచ్చునన్నారు.

# నేడు టీడీపీ మండల సమావేశం

కొయ్యూరు : ఈ నెల 14న మండల తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అద్యక్షులు కొర్రు రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తెలుగుదేశం జిల్లా రూరల్ ఉపాధ్యక్షులు ఎంవివి.ప్రసాద్, ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ రానున్నారని తెలిపారు. అల్లూరి మ్యూజియంలో జరిగే ఈ సమావేశానికి పార్టీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**BEFORE THE HONOURABLE DISTRICT CONSUMER FORUM-1 AT VISAKHAPATNAM**
**C.C.No.317 OF 2017**

**Between:**
**1) Dr. Gopisetti Sai Gopal**
**2) Smt. Gopisetti Sujatha** ...Complainants
**And**
**1) UAE XCHANGE,**
**2) Sri Srinivas Kumar Akula, Branch Head - UAE XCHANGE** OPPOSITE PARTIES
**To**
**OPPOSITE PARTIES**
**1. UAE XCHANGE, 2-30-26/1, Sector-VI, Jami Function Hall Building, MG Cancer Hospital Road, Visakhapatnam-530 017.**
**2. Sri Srinivas Kumar Akula, Branch Head - UAE XCHANGE , 2-30-26/1, Sector-VI, Jami Function Hall Building, MG Cancer Hospital Road, Visakhapatnam-530 017.**

Please take notice that the above application, as you are avoiding receive Summons, the Honourable Court ordered publication in this paper by way of notice to you under Order-5 Rule-20 of C.P.C. The matter is posted for your appearance in person or through duly instructed Advocate at **10.30 A.M.** on **27-03-2018.** If you fail to attend, the matter will be disposed of by the Honourable Court according to law without any further notice to you.

**M/s Lanka Venkateswarlu & Co.,**
**Sri Lanka Jagannadham**
**Sri Lanka Venkateswarlu**
**Advocates**
**17-Rajendranagar,**
**Visakhapatnam-530 016.**

# కామాడి పుట్టించిన కలకలం
# గినిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకి అవమానం



పెద్దాపురం : కామెడీతో నవ్వించడానికి నిరంతరం టివి ఛానల్స్‌లో వస్తున్న ప్రసారాలు కొన్ని సందర్భాలలో ప్రజల మనోభావాలకు అవమానం కల్గించడంతో ఆ వార్తలు ప్రజలలో కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నెపధ్యంలో 10వ తేదీ శనివారం రాత్రి 9.30 గంటలకు స్టార్ మా అనె టెలివిజన్‌లో ఎపిసోడ్ నెం 13ల వచ్చిన వార్త పెద్దాపురం ప్రజలను అవమాన పరిచేవిధంగా ఉందని పెద్దాపురం సూక్ష్మకళాఖండాల తయారీలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన డాక్టర్ తాళీబత్తుల సాయి పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పట్టణంలోగాల శ్రీకామాక్షి స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీర్యాలీ నిర్వహించి మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఛానల్‌లో వచ్చిన కామెడీ పెద్దాపురం ప్రజలను, కళాకారులను తీవ్రంగా అవమానించడం జరిగిందని, పేర్లతో సహా అవహేళన చేశారని ఈ ఛానల్‌లో పాల్గొన్న నవదీప్, వేణు, ధనరాజ్, ప్రభాకర్, హరితేజలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు క్షమాపణలు చెప్పాలని లేని యెడలా రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాళాబత్తుల సాయి, తామపల్లి దుర్గాప్రసాద్, చింతాడ శ్రీను, లంకా సూరిబాబు, వీరభద్రాచారి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ అమలుచేయాలి



అమలాపురం: కాపునాడు జాతీయ అధ్యక్షులు తాడివాక రమేష్‌నాయుడు జిల్లా పర్యనటలో భాగంగా అమలాపురం విచ్చేశారని మంగళవారం కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల సురేష్ తెలిపారు. కాపు, తెలగ, ఒంటరి, బలిజ రిజర్వేషన్లు వెంటనే అమలుచేయాలని, రిజర్వేషన్ శాతాన్ని 15శాతంకు పెంచాలని, కాపు కార్పొరేషన్‌ను 4సంవత్సరాలకు రూ.4000వేల కోట్లును జమచేసి పిల్లలకు హాస్టల్ నిర్మాణం చేపట్టాలని, రాజధానిలో హాస్టల్‌కు భూమిని కేటాయించాలని రమేష్‌నాయుడు కోరారు. ఈ సమావేశంలో అరిగెల తేజ, నిమ్మకాయల సత్యక్రాంతి కిశోర్, మురమళ్ళ శివారెడ్డినాయుడు, కొప్పుల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'పది' పరీక్షల తీరు మారాలి
# పడాల చారిటబుల్...లోక్‌సత్తా డిమాండ్



కాకినాడ : గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో నిర్వహిస్తున్న పరీక్షలు ప్రహసనంగా మారాయని నిర్వహణతీరు మారాలని పడాల చారిటబుల్‌ట్రస్టు...లోక్‌సత్తా సంస్థలు డిమాండ్ చేసాయి.ఈ సందర్భంగా మహర్షి బలుసు సాంబమూర్తి బదిరులు పాఠశాలలో సంస్థ ప్రతినిధులు పడాల సూర్య ప్రసాద్, ఉప్పలపాటి మాచిరాజు విలేకరులతో మాట్లాడుతూ సమాజాన్ని నాసనం చేసే విధంగా పరీక్షలలో ఉతీర్ణులయ్యేందకు చదవక్కరలేదనే ధోరణిలో ఉన్నారన్నారు. విద్యా వ్యవస్థలో మార్పురావాలని సూచించారు.తీరు మారాలని కొన్ని ఉద్యోగాల ఎంపికలో ఆంధ్రా విద్యార్థుల పదోతరగతి ఫలితాలను పరిగణతోనికి తీసుకోరాదని కొన్ని సంస్థలు నిర్ణయించడం ఆందోళన కరమన్నారు. విద్యావ్యవస్థలో తీరుమారాలఅన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాది జవహర్ ఆలీ,క్రియ సంస్థ కు చెందిన ఎస్ఎస్ఆర్ జగన్నాధరావు, తోట రాంబాబు తదితరులుపాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు
# కొమ్ముల రాంబాబు ఆకాల మరణం



అమలాపురం: కొమ్ముల రాంబాబు ఈ పేరు పాత్రికేయ లోకానికి పరిచయం అక్కరలేని పేరు. జర్నలిజానికి విశ్లేషణను, వేగాన్ని జోడించి సామాజికి బాధ్యతతో కూడిన పలు వార్తలు రచించిన రాంబాబు ఆకాల మరణం పట్ల జిల్లాలోని జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సంఘాలకు అతీతంగా పాత్రికేయ లోకం రాంబాబు మృతి పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన కొమ్ముల రామచంద్రరావు (రాంబాబు) మంగళవారం తెల్లవారుజామున ఆకాల మరణం చెందరు. ఆయన గత కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మాచవరంలోని ఆయన స్వగృహంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. రాంబాబుకు తల్లి, సోదరుడు ఉన్నారు. రాంబాబు మృతి పట్ల ది.అమలాపురం ప్రెస్‌క్లబ్, ది.అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్(తాజా), ఎపిడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుఎఫ్‌లతో పాటు వివిధ పాత్రికేయ సంఘాల నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలువురు పాత్రికేయులు, నాయకులు, అభిమానులు రాంబాబు భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళు లర్పించారు.

## పెద్దాపురంలో పెరిగిన ఎండతీవ్రత

పెద్దాపురం : పట్టణంలో ఎండతీవ్రత నానాటికీ పెరగడంతో ఉదయం 12 గంటలనుండి ప్రజలు ఎండవేడిమికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోతున్నాయి. వ్యాపార సంస్థలలో రద్దీ తగ్గుతూ వస్తుంది. ప్రధాన రోడ్లులో రద్దీ తగ్గి నిర్మానుష్యంగా ఉంటున్నాయి. పట్టణం మెట్టప్రాంతం కావడంతో నీటి నిల్వలు లేకపోవడంతో వేడి త్వరగా ప్రవేశించి ఇబ్బందులు పాలుచేస్తుంది. రాబోయే రోజులలో ఈ వేడిని భరించడం కష్టమని ప్రజలు ఇప్పటినుండే ఆందోళన చెందుతున్నారు.

## ప్రభుత్వం ఐటిఐలో తనిఖీ

యానాం : స్థానిక ద్రాక్షారాం రోడ్డులోని నేతాజీ సుభాస్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐను ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు తనిఖీ నిర్వహించారు. ఫ్యాషన్ టెక్నాలజీ, మోటర్ మెకానిక్, ఎలక్ట్రీషన్, ఫిటర్, తదితర ట్రేడ్‌లలో చదువుతున్న విద్యార్థులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లలో ఉన్న యంత్ర సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులు తరగతులకు క్రమతప్పకుండా హాజరు అయ్యేలా అధ్యాపకులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో ప్రధానాచార్యుడు ప్రభాకరన్, తదితరులు పాల్గొన్నారు.

## 19, 20 తేదీలలో వైకల్య ధృవీకరణ పత్రాల పంపణీ

యానాం : నియోజకవర్గంలోని యానాం ప్రాంతానికి చెందిన న్యూరో ఆర్థోపిటిక్ చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైకల్యాలు గల దివ్యాంగులకు ఈ నెల 19 20 తేదీలో పుదుచ్చేరి నుంచి వచ్చే ప్రభుత్వ వైద్య నిపుణుల బృందం తనిఖీ నిర్వహించి నిర్ణీత వైకల్య శాతం ధృవీకరణ పత్రాలను పంపిణీచేయడానికి అన్ని ఏర్పాట్లుచేసినట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. వైద్య పరీక్షలు తనిఖీ చేయించుకోవడానికి ఆసక్తిగల స్థానిక దివ్యాంగులు ఈ నెల 15, 16 తేదీలలో తమ పేర్లను ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదు చేయించుకోవాలన్నారు. రేషన్‌కార్డు, వాటర్ గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటోలను తప్పనిసరిగా తీసుకునిరావాలని ఆరోగ్యశాఖ డిడి ఎంవిఎస్ ప్రసాద్ తెలిపారు.

## పరీక్షా కేంద్రాలవద్ద జెరెక్స్ దుకాణాలు మూసివేయాలి

యానాం : పదోవతరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15 ప్రారంభం కానున్న నేపధ్యంలో పరీక్షా కేంద్రాలకు కిలోమీటరు దూరం వరకు ఉన్న జెరెక్స్ దుకాణాలను మూసివేయాలని తునికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. జయచంద్రన్ తెలిపారు. 15 నుంచి 29 వరకు పరీక్షలు జరిగే అన్ని రోజులలోను ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జెరెక్స్ దుకాణాలు తెరవకుండా వ్యాపారులు సహకరించాలన్నారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఉచితముగా దివ్యాంగులకు కృత్రిమ పరికరములు

రావులపాలెం : మండల పరిధిలో గల దివ్యాంగులకు అవసరమైన కృత్రిమంగా చేతులకు, కాళ్ళకు అవసరమగు పరికరములు, కాలిబర్స్ ఉచితముగా అందించనున్నట్లు ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు తెలిపారు. కృత్రిమ పరికరములు అవసరమైన దివ్యాంగులు ఆధార్ కార్డుతో నేడు తమ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ఎపిడబ్ల్యూజె నగర అధ్యక్షునిగా జీవన్



కాకినాడ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘానికి నగర అధ్యక్షునిగా జెబిజె జీవన్( వార్త) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సాధన, అక్రిడిటేషన్‌ల జారీలో జరుగుతున్న అలసత్వాన్ని నివారించేందుకు సంఘంతో కలిపి కృషి చేస్తానని తెలిపారు. ఎపియూడబ్యాజె బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.కాకినాడ నగర కార్యదర్శిగా జెవిఎల్ మూర్తి (సాక్షి) ,ఉపాధ్యక్షునిగా డిఎల్ రాజు(పెన్‌పవర్) కార్యదర్శిగా పళ్ళంరాజు( ఆంధ్రప్రభ),కోశాధికారిగాశ్రీధర్‌ను ఎన్నుకున్నట్లుగా జిల్లా అధ్యక్షులు స్వాతి ప్రసాద్ తెలిపారు.

## నిత్య అన్నదాన పధకానికి రూ.లక్ష విరాళము



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి హైదరాబాదుకు చెందిన భూపతిరాజు.భాస్కర్ ప్రతీ సంవత్సరం మే 13 వ తేదీన ధనుంజయ గోత్రముతో అన్నదానం జరిపించుటకు రూ.లక్ష విరాళముగా ఎసి ఈరంకి.జగన్నాధరావు గార్కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్వో తులా.రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 20 నుండి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ సారవత్రిక విద్యాపీఠం( ఏపిఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో పదవతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 20 నుండి 30 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహాం తెలిపారు. జూన్2017 నాటికి రెగ్యులర్‌గా పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో తప్పిన పాత సిలబస్ లోని (సిసిఇ మోడ్ అమలుకు పూర్వం) అభ్యర్థులు ఇకపై ఎస్ఎస్‌సి పరీక్ష పాస్ అగుటకు ఎపి సార్వత్రిక విద్యాపీఠం ఏప్రిల్ 2018లో నిర్వహించు ఎస&ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు హాజరుకావలనిందన్నారు. కావున 2017 నాటికి ఫెయిల్ అయిన రెగ్యులర్ అభ్యర్థులు ఏదేని ఏపిఆన్‌లైన్ సేవా కేంద్రం నందు పరీక్ష రేసుము సబ్జెక్టు ఒక్కింటికెఇ రూ.100 చొప్పునీనెల 14 నుండి 20 వరకు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలన్నారు.

# సారాని నిర్మూలిద్దాం-జీవితాన్ని కాపాడుదాం



అన్నవరం : తు.గో.జిల్లా పిఇ.చిన్నయ్యపాలెంలో డ్వాక్రా మహిళలు గ్రామ ప్రజలు అందరూ కలసి సారాని నిర్మూలిద్దాం-జీవితాన్ని కాపాడుదాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తొండంగి ఎస్సై కృష్ణమాచార్యులు, మండల ఉపాధ్యక్షులు నరహరశెట్టి.సూర్యప్రకాష్ మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆద్వర్యంలో దళితవాడలు మరియు గ్రామ పురవీదులగుండా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరహరశెట్టి.ప్రకాష్ మాట్లాడుతూ సారా, మత్తుపానీమాలు సేవించడం వలన కొన్ని కుటుంబాలు రోడ్డున పడతున్నాయని,మహిళల మెడలలో తాళిబొట్టు కుడా అమ్మి రోడ్డున పడి కొన్ని కుటుంబాలు నాశనము అవుతున్నాయని కావున గ్రామాన్ని సారా రహిత గ్రామముగా తీర్చి దిద్దుదామని గ్రామ ప్రజలకు హితవు పలికారు.

# 43వ రేషన్ దుకాణం సీజ్

తాళ్లరేవు : నిత్యావసర వస్తువుల సరఫారాలో అక్రమాలు జరుగుతున్న పిల్లంకలో 43వ రేషన్ దుకాణాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ దుకాణంలో అక్రమాలు జరుగుతున్నాయని ఇచ్చిన ఫిర్యాదుమేరకు అధికారులుతనిఖీ నిర్వహించి వాస్తంగా నిల్వ ఉన్న 1200 కేజీల బియ్యం, 150 కేజీల పంచదార అదనంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరకులు సక్రమంగా పంపిణీచేయడంలేదని అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బాతో తూకం వేయడం, వేలిముద్రలుతీసుకొని వెంటనే సరకులు ఇవ్వకుండా స్లిప్‌లు ఇవ్వడం, రసీదులు కార్డుదారులకు ఇవ్వకపోవడం వంటి అక్రమాలు గుర్తించారు. దీనిపై డీలర్ ఎం.సూర్యనారాయణ పై కేసు నమోదుచేసి దుకాణాన్ని సీజ్ చేసినట్లు సహాయ సరఫరాలశాఖ అధికారి పీతల సురేష్ తెలిపారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ రెవెన్యూ డివిజనల్ అధికారికి నివేదిక అంద చేస్తామన్నారు. లంక గ్రామలతోపాటు మరికొన్ని దుకాణాలలో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని త్వరలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఎంఎస్ఒ సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు
# ప్రజ్ఞా వికాస్ టాలెంట్ టెస్ట్



రావులపాలెం : ఎస్.ఎఫ్.ఐ., యు.టి.ఎఫ్. ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రజ్ఞా వికాస్ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ఎఫ్.డబ్ల్యు.ఎస్.సి. డైరెక్టర్ నక్కా డేవిడ్ రాజు తెలిపారు. మండలంలో ప్రధమ బహుమతి జి. స్నేహలత, ద్వితీయ బహుమతి అహ్మద్ ఆలీషా, తృతీయ స్థానంలో జయ ప్రకాష్ బహుమతులు పొందినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి.వి.వి. సుబ్బరాజు, మండల కార్యదర్శి అర్జునరావు, ప్రధానోపాధ్యాయులు పి. సుబ్బరాజు, సిఐటియు జిల్లా నాయకులు బలరామ్, ఎస్.ఎఫ్.ఐ. భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకలు కేతా ప్రేమ్ కుమార్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ తీరుపట్ల చేనేత సంఘాల గుర్రు
## తాడోపేడో తేల్చు కోవడానికి ర'ఢీ 'అవుతున్న కార్మికులు



కాకినాడ : దేశంలో మరియు రాష్ట్రంలో వ్యవసాయ రంగంతరువాత అతిపెద్ద పరిశ్రమగా పేరొందిన చేనేత రంగాన్ని దివాళా తీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా చేనేత సంఘాలు, కార్మికులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి రఢీ అవుతున్నాయి. చేనేత కులాల సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా అద్యక్షులు పంపన రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చెర్వు సెంటర్‌లో గల డ్రైవర్స్ అసోషియేషన్‌లో సమావేశమై భవిష్య కార్యాచరణను రూపొందించు నున్నారు. ముఖ్యంగా2018'19 రాష్ట్ర బడ్జెట్ రూ.1,99,000లుకోట్ల పైచిలుకులో కేవలం చేనేతలకు 250కోట్ల రూపాయలు కేటాయించడం పట్ల వీరు గుర్రుగా ఉన్నారు.ఆ 250 కోట్లరూలలో140 కోట్లు జౌళి శాఖ(యంత్రాల ద్వారా బట్టల తయారీ)కు మరియు 40కోట్లుచేనేత, జౌళిశాఖ ఉద్యోగస్తుల జీతాలకుమినహాయించి కేవలం 70కోట్ల రూపాయలు చేనేత చేతి వృత్తిదారులకు కేటాయించడం అమానుషమంటున్నారు.నిత్యం మగ్గం గుంటలో నలిగిపోతున్న 24లక్షల మందికి ఈ70కోట్లు ఏవిధంగా సరిపోతుందన్నారు. అదేవిధంగా 2016-17 సంవత్సరంలో చేనేత వస్త్రాలపై 20శాతం రిబేట్ ఇచ్చి అమ్మకాలు జరుపుకోవడానికి 6కోట్లు మంజూరు చేసారని అయితే కడపజిల్లాకు చెందిన ఆప్కో చైర్మన్ రూ.225 కోట్ల 32లక్షలు ఒక కడపజిల్లాలోనే అమ్మకాలుగా చూపించి ప్రభుత్వం మంజూరు చేసిన ఆరు కోట్ల రిబేట్‌లో 4కోట్ల 58లక్షల 73 వేల రూపాయలు కైంకర్యం చేసిన విషయంపై విచారణ జరిపించాలని డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో చేనేత కార్పోరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్లు నిధులు కేటాయింపు,చేనేత కులంలో పుట్టిన ప్రతీ ఒక్కరికీ 50సంవత్సరాలు నిండి తరువాత ఫించన్ ఇచ్చే విధానం అమలయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ అవసరమైతే రాబోయే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు చేనేత సంఘం సమాయత్తమవుతున్నాయి.

# గాయని చిన్మయికి చేదు అనుభవం



ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాదకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఓ వ్యక్తి తనను అసభ్యంగా పట్టుకున్నాడట. ఈ విషయాన్ని ఆమె సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. నిన్న జరిగిన కార్యక్రమంలో ఓ వ్యక్తి నన్ను పట్టుకున్నాడు. ఈ కథను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాను. నన్ను షాక్‌కు గురి చేసిన విషయం ఏంటంటే.. చిన్నతనంలో ఎంత మంది లైంగిక వేధింపులకు గురై ఉంటారో..! సొంత ఇంట్లో, బహిరంగ ప్రదేశాలు, పనిచేసే ప్రదేశాలు, విద్యా సంస్థల్లో వేధింపులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది అమ్మాయిలు, అబ్బాయిలు తమకు జరిగిన వేధింపుల గురించి కుటుంబ సభ్యులతో, స్నేహితులతో చెప్పడం లేదు. ఎందుకంటే ఎవరూ నమ్మరు కాబట్టి. అమ్మాయిలు చెబితే నమ్ముతారేమో కానీ అబ్బాయిలు చెబితే ఎవరూ నమ్మరు. చిన్నతనంలో ఎదుర్కొన్న వేధింపుల గురించి అబ్బాయిలు చెబితే వారిని హేళన చేస్తారు. అమ్మాయిలు ధైర్యం చేసుకుని చెబితే.. వారిని తప్పుబడతారు. నీ దుస్తులు, లుక్ అలా ఉన్నాయి కాబట్టే వేధించారు అంటూ బాధిత మహిళను మరో మహిళ అనడం చాలా బాధాకరం. బాధితురాలితో ఎలా ఉండాలనే విషయంలో మహిళకు శిక్షణ అవసరం.

చదువు ఆపేస్తారేమో?, ఉద్యోగం వద్దని ఇంట్లోనే ఉండమంటారేమో? అనే సందేహంతో కొంత మంది అమ్మాయిలు వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడుతున్నారు. దయచేసి బాధితులను వారి లిప్‌స్టిక్, జుట్టు, శరీర రంగు, దుస్తులు, వైఖరి, నైపుణ్యం, తెలివి తదితర విషయాల్లో హేళన చేయడం ఆపండి. చాలా మంది అబ్బాయిలు కూడా వేధింపులకు గురవుతున్నారు. వీరందరికీ మద్దతు కావాలని అర్థం చేసుకోండి. హేళన చేయకండి.

ధన్యవాదాలు అని ట్వీట్ చేశారు చిన్మయి. చిన్మయి గతంలోనూ ఇలాంటి అనుభవాలు ఎదుర్కొన్నారు. గతేడాది ఆమె న్యూయార్క్ వెళ్లినప్పుడు తన ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారు నుంచి కొన్ని వస్తువులు దొంగతనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# చిత్రభాను

## సరికొత్త లక్ష్యం



వృత్తిపరంగా తాను కొత్త లక్ష్యాల్ని నిర్దేశించుకున్నానని చెప్పింది పంజాబీ సుందరి కాజల్ అగర్వాల్. భాషాపరంగా ఎలాంటి హద్దులు విధించుకోలేదని, అవకాశమొస్తే హాలీవుడ్‌లో కూడా నటించడానికి సిద్ధమేనని పేర్కొంది. కథ, నా పాత్ర చిత్రణ నచ్చితే ఏ భారతీయ భాషా చిత్రంలోనైనా నటించడానికి అభ్యంతరం లేదు. ప్రస్తుతం సృజనాత్మక పరిధులు విస్తరిస్తున్నాయి. నా సమకాలీన కథానాయికలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. తమ ప్రతిభకు మెరుగులుదిద్దుకుంటూ ప్రపంచ సినిమాపై సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం నాకు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో మంచి అవకాశాలొస్తున్నాయి. భవిష్యత్తులో అంతర్జాతీయ సినిమా నటించాలని వుంది. ఆ అవకాశం వస్తే సంతోషంగా స్వీకరిస్తాను అని చెప్పింది. పెళ్లి గురించి ప్రస్తావించగా ప్రస్తుతం మూడు భాషల్లో సినిమాలు చేస్తున్నాను. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదు. ప్రేమ పెళ్లా? పెద్దలు కుదిర్చిన పెళ్లా? అనే విషయాన్ని ఇంకా నిర్ణయించుకోలేదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి తారసపడితే మాత్రం తాత్సర్యం చేయకుండా ప్రేమ విషయాన్ని అందరికి తెలియజేస్తాను అని చెప్పింది కాజల్ అగర్వాల్.

## స్టార్ హీరోలందరినీ దాటి.. సెకండ్ ప్లేస్‌లోకి విజయ్ దేవరకొండ



అంతకు ముందు చేసిన సినిమాల మాటేమిటో కానీ.. అర్జున్ రెడ్డి సినిమా మాత్రం విజయ్ దేవరకొండను స్టార్ హీరోగా నిలబెట్టింది. పెద్దగా ఏ అంచనాలూ లేకుండా వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం విజయ్ పొజిషన్ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు. హైదరాబాద్ టైమ్స్ నిర్వహించిన మోస్ట్ డిజైరబుల్ మెన్ 2017లో విజయ్ 2వ స్థానంలో నిలిచాడు. దీనికి సంబంధించిన క్రెడిట్ అంతా అర్జున్‌రెడ్డి మూవీకే దక్కుతుంది. టాలీవుడ్ స్టార్ హీరోస్ ప్రభాస్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్ వరుసగా మూడు, నాలుగు, ఐదు, ఆరు పొజిషన్లలో నిలవగా విజయ్ వారిని దాటుకుని వెళ్లి మరీ సెకండ్ ప్లేస్‌లో నిలిచాడు. ఈ పెళ్లి చూపులు హీరో ఇచ్చిన బోల్డ్ స్టేట్‌మెంట్స్ యూత్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యాయి. దీంతో యూత్‌లో విజయ్‌కి ఫ్యాన్ ఫాలోయింగ్ బాగా పెరిగింది.

## జెనిటిక్ లవ్‌స్టోరీ..



సంతోష్‌రాజ్, నేహాదేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం అనువంశికత. జెనిటిక్ లవ్‌స్టోరీ చిత్ర ఉపశీర్షిక. రమేష్ ముక్కెర దర్శకత్వం వహిస్తున్నారు. తాళ్లపెల్లి దామోదర్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాలు విడుదలయ్యాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నో కష్టాలకోర్చి నిర్మాత దామోదర్ ఈ సినిమాను నిర్మించారు. ఆయనకు మంచి పేరును తెచ్చిపెట్టాలి అని అన్నారు. రక్త సంబంధీకులు పెళ్లి చేసుకుంటే ఎదురయ్యే పరిణామాల నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. సందేశాత్మక కథాంశంతో తెరకెక్కించాం అని నిర్మాత పేర్కొన్నారు. కుటుంబ బంధాలు, ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాల సమాహారంగా ఈ సినిమా సాగుతుందని, తమ తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకముందని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమన్, కొత్త మనోహర్‌రెడ్డి, తైదల బాపు తదితరులు పాల్గొన్నారు.

## పూజా తీన్‌మార్..!



అదృష్టమంటే పూజా హెగ్డేదే అంటున్నారు టాలీవుడ్ జనాలు. ఈ కన్నడ కస్తూరి పట్టిందల్లా బంగారమే అవుతున్నది. ఆమెకు భారీ చిత్రాల్లో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీపైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా ఖరారైన విషయం తెలిసిందే. ఎన్టీఆర్-త్రివిక్రమ్ చిత్రంలో కూడా ఈ అమ్మడే కథానాయిక. తాజాగా ఈ సొగసరి ప్రభాస్‌తో జోడీ కట్టబోతుంది. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూజా హెగ్డే వెల్లడించింది. ప్రస్తుతం సాహోలో నటిస్తున్న ప్రభాస్..ఈ సినిమా అనంతరం రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో స్వీయనిర్మాణ సంస్థ గోపీకృష్ణ మూవీస్ పతాకంపై ఓ సినిమా చేయబోతున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటించనుంది. త్వరలో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభంకానున్నట్లు సమాచారం. ముకుంద చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన పూజాహెగ్డే ఆ తర్వాత బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంది. గత ఏడాది దువ్వాడ జగన్నాథమ్ చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది.

ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్ సరసన సాక్ష్యం చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. రామ్‌చరణ్ రంగస్థలంలో ఓ ప్రత్యేక గీతంలో నర్తించింది. తాజాగా అగ్ర హీరోల సరసన మూడు భారీ సినిమాల్లో అవకాశాల్ని సొంతం చేసుకొని తారాపథంలో దూసుకెళ్లడానికి సిద్ధమవుతున్నది.

## మధ్యతరగతి మందహాసాలు



పుత్రోత్సాహం తండ్రికి పుత్రుడు జన్మించినపుడే కలగదు. జనులా పుత్రుని గనిగొని పొగడగా పుత్రోత్సాహంబు కలుగును. అలా తండ్రి పేరును నిలబెట్టడానికి ఓ కొడుకు ఏ విధమైన ప్రయత్నాలు చేశాడు? ఈ క్రమంలో ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నాడు? అనేది తెలియాలంటే తెరపై చూడాల్సిందే అంటున్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం నీది నాది ఒకే కథ. ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణరావు నిర్మిస్తున్నారు. వేణు ఊడుగుల దర్శకుడు. సాట్నా టైటస్ కథానాయిక. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలకానున్నది. నిర్మాతలు మాట్లాడుతూ నవతరం మనోభావాలకు దర్పణంలా నిలిచే చిత్రమిది. వాస్తవికతకు, బాధ్యతలకు మధ్య నలిగిపోయే ఓ మధ్యతరగతి యువకుడి కథతో తెరకెక్కిస్తున్నాం. చదువుపై ఇష్టం లేకపోయినా తండ్రి మాటకు కట్టుబడిన అతడు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నాడనేది హృద్యంగా అనిపిస్తుంది. చిత్తూరు యాసలో శ్రీవిష్ణు చెప్పే సంభాషణలు ఆకట్టుకుంటాయి. ఇటీవలే విడుదలైన గీతాలకు, ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. బిచ్చగాడు ఫేమ్ సాట్నా టైటస్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని తెలిపారు. పోసాని కృష్ణమురళి, దేవిప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, ఛాయాగ్రహణం: రాజ్ తోట, ఆర్ట్స్: టి. ఎన్. ప్రసాద్.

## చిప్ప తప్ప ఏమీ మిగల్లేదు : కేంద్రంపై మనోజ్ సీరియస్



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా దక్కకపోవడంపై సామాన్యులతోపాటు సినీ ప్రముఖులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హీరో నిఖిల్, డైరెక్టర్ కొరటాల శివ, మోహన్‌బాబు, బీవీయస్ రవి, కోన వెంకట్ తదితరులు కేంద్రంపై, ప్రధాని మోదీపై విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా హీరో మంచు మనోజ్ ఏపీకి ప్రత్యేక హోదా దక్కకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ట్విటర్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఘాటుగా సమాధానాలిచ్చాడు మహారాష్ట్రలో రైతుల డిమాండ్లకు అంగీకరిస్తూ ప్రభుత్వం రాతపూర్వకంగా హామీలిచ్చింది అని ఓ అభిమాని చేసిన ట్వీట్‌కు మనోజ్ ఘాటుగా స్పందించాడు. మనకు ప్రత్యేక హోదా కూడా ఇస్తా అన్నారు. చిప్ప తప్ప ఏమీ మిగల్లేదు. కేంద్రాన్ని నమ్ముకుంటే సంకనాకి పోతాం అని మనోజ్ సమాధానం ఇచ్చాడు. అనంతరం రాష్ట్రంలో ఏ పార్టీని నమ్మాలి అనే మరో ప్రశ్నకు స్పందిస్తూ..


నిన్ను నమ్ముకోవడం ఉత్తమం అని జవాబిచ్చాడు. అలాగే మరో ప్రశ్నకు జవాబిస్తూ.. దక్షిణాదిలో రెండో రాజధాని పెట్టే వరకు మనకు ఈ బానిస బతుకులు తప్పవు అని మనోజ్ తేల్చిచెప్పాడు.

# ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు.. 144 సెక్షన్ విధింపు - ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- హాల్ టికెట్లు అందనిచో www.bseap.org వెబ్‌సైట్‌లో లభ్యం
- ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవు

జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి





**సమస్యాత్మక కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు**

*అరకులో 3, చింతపల్లిలో 1, పాడేరులో 3 మొత్తం 7 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. అన్ని కేంద్రాలకు ఆర్టీసీ రవాణా సంస్థ సహకారంతో బస్సులను నడుపుతున్నారు. హాల్ టికెట్ చూపిస్తే చాలు బస్సులో ప్రయాణ సౌకర్యం కల్పించామని విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి తెలిపారు.*


విశాఖ సిటీ : ఈ నెల 15వ తేదీ నుండి 29వ తేదీ వరకు జరబోవు ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలు జిల్లాలోని ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరగబోవు అన్ని పరీక్షా కేంద్రాలలో పూర్తి ఏర్పాట్లు (వైద్యం, తాగునీరు, ప్రత్యేక కంట్రోల్ రూం, బందోబస్తు ఏర్పాట్లు) చేసినట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వర రెడ్డి తెలియజేశారు. మంగళవారం డిఇఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షలు 240 కేంద్రాలలో నిర్వహించబడుతున్నట్లు, ఈ పరీక్షలకు సుమారు 55,493 మంది విద్యార్థులు హాజరౌతున్నారని తెలిపారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 54,896 మంది కాగా, ప్రైవేట్ విద్యార్థులు 597 మంది అని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు (కాన్ఫిడెన్సియల్ మెటీరియల్) 78 స్టోరేజ్ పాయింట్లలో పూర్తి భద్రత మధ్య ఉంచినట్లు వారు తెలియజేశారు. ఈ పరీక్షలక ఎటువంటి అంతరాయం కలగకుండా 24 గంటలూ పని చేయు విధంగా ప్రభుత్వ క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాల విశాఖపట్నంనందు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఏ విధమైన అంతరాయం కలిగినచో ఫోన్ నెం. 6300149229, 6300158988లకు సంప్రదించ వలసిందిగా కోరారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలకు హాల్ టికెట్లు పంపించడమైనదని, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేయడం జరిగిందని డిఇఓ తెలియజేశారు. ఇంకా ఎవరైనా విద్యార్థులకు హాల్ టికెట్లు అందని పక్షంలో www.bseap.org వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ప్రధానోపాధ్యాయులతో ధృవీకరించికోవాలని తెలియజేశారు. పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడమైనది. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించడమైనది. విద్యార్థులు ఎటువంటి అభ్యంతరకర పరికరాలను అనగా సెల్‌ఫోన్లు, పేజర్స్, కాలిక్యులేటర్స్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని పరీక్షా కేంద్రాలకు వెళ్లరాదని తెలిపారు.

పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల లోపు ఎటువంటి జెరాక్స్ కాపీలను తెరచి ఉంచరాదన్నారు. మెయిన్ ఆన్సర్ షీట్‌పై ఉన్న నంబర్లను అడిషనల్ పేపర్లపైనా, బిట్ పేపర్లపైనా తప్పక వేయవలెనని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో తగిన ఫర్నిచర్‌ను ఏర్పాట చేయడమైనదని తెలిపారు. పరీక్షలు సజావుగా జరుగుటకు విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని విధాలా సహకరించవలసినదిగా జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వర రెడ్డి కోరడమైనది.

# వేద పరిరక్షణకు గట్టిగా కృషి చేయాలి

వేద పాఠశాలకు 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా..

విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి



పెందుర్తి: షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు విశాఖ శ్రీ శారదాపీఠంలో గ 15 సంవత్సరాల క్రితం ఇదే రోజు జగద్గురు శంకరాచార్య వేద పాఠశాలను స్థాపించారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ భగవంతుని యొక్క ఉచ్ఛ్వాస, నిశ్వాసములే వేదములని, వాటిని పరిరక్షించవలసిన మన అందరిదీ అని అన్నారు. ఈ విద్యా వ్యవస్థలో ఎంతో మంది వేద, స్మార్త విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగింది. వీరంతా నేడు యావత్ భారతదేశంలో ఉన్నత స్థానంలో ఉన్నారు. పీఠంలో ప్రతీ సంవత్సరం వీరంతా అనన్యమైన గురు భక్తితో ఇప్పటికీ పీఠంలో జరిగే అన్ని కార్యక్రమాలలో పాల్గొని గురు భక్తిని చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠం ఒక కీలక నిర్ణయం తీసుకుంటున్నదని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కడైనా ఏ ప్రాంతంలోనైనా పోషించడానికి గాని, ఆర్థిక భారంతో ఉన్న వేద పాఠశాలలను శారదా పీఠం దత్తతకు తీసుకుని వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. గురువులను, విద్యార్థులను తమ పీఠానికి తరలించి వేద విద్యతో పాటు (రుగ్వేదము, యజుర్వేదము) సార్తము, ధర్మశాస్త్రములు, ఆగమ శాస్త్రాన్ని, సంస్కృత పరిజ్ఞానాన్ని వసతితో పాటు కల్పించాలని భావిస్తున్నామన్నారు. ఈ విద్యార్థతలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు శారదా పీఠం తరఫున ఉత్తీర్ణత పత్రమును (సర్టిఫికేట్) లక్ష రూపాయలు బహుకరిస్తామని స్వామి వారు తెలియజేశారు. ఆసక్తిగల వారు విశాఖ శ్రీ శారదాపీఠంను సంప్రదించాలని పీఠం ధర్మాధికారి జి. కామేశ్వర శర్మ తెలిపారు.

## ఆద్యంతం ఊగిసలాటే..

ముంబయి: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో భారీ లాభాల్లో దూసుకెళ్లిన దేశీయ మార్కెట్లు మంగళవారం మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో ఆరంభం నుంచే ఊగిసలాడుతూ వస్తున్న మార్కెట్లు చివరకు మిశ్రమ ఫలితాలను సాధించాయి. సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోగా.. నిఫ్టీ ఫ్లాట్‌గా ముగిసింది.

# డీజీపీకి పవన్ కల్యాణ్ లేఖ



అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ డీజీపీ మాలకొండయ్యకు లేఖ రాశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా బుధవారం జరిగే జనసేన ఆవిర్భావ సభకు భద్రత కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై దాడి జరిగితే ప్రజాజీవితంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గతంలో భీమవరంలో ఫ్లెక్సీ చింపివేసినందుకే అభిమానులు ధర్నా చేశారని, శాంతిభద్రతల సమస్యగా మారిందని పవన్ గుర్తుచేశారు. ఇటీవల అనంతపురం పర్యటనలో తొక్కిసలాట ఘటన దృష్ట్యా తాను భద్రత కోరుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. భద్రతకు పోలీసులు నిస్సహాయత ప్రకటిస్తే.. ఏదైనా జరిగితే మాత్రం ప్రభుత్వానిదే బాధ్యత అని పవన్ లేఖలో స్పష్టం చేశారు. మార్చి 14 తర్వాత కూడా తనకు అందిస్తున్న వ్యక్తిగత భద్రతను కొనసాగించాల్సిందిగా పవన్ డీజీపీని కోరారు.

# మోదీ కాళ్లు పట్టుకున్నారా, లేదా?



కిర్లంపూడి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓటుకు నోటు కేసు నుంచి బయటపడటానికే ప్రత్యేక హోదాను అమ్మేశారని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆరోపించారు. మంగళవారం చంద్రబాబును పలు అంశాలపై ప్రశ్నిస్తూ బహిరంగ లేఖ రాశారు. ఓటుకు నోటు కేసులో భయపడే హైదరాబాద్ నుంచి విజయవాడకి పారిపోయి వచ్చారు, హోదా అమ్మేస్తాను అరెస్టు నుంచి కాపాడాలని ప్రధాని నరేంద్ర మోదీ కాళ్లు పట్టుకున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి ఖర్చులు చెప్పలేకే ప్రత్యేక హోదా పేరుతో రోడ్డెక్కితే ప్రజలు గుర్తించలేరనుకోవడం చంద్రబాబు మూర్ఖత్వమే అవుతుందని ముద్రగడ అభిప్రాయపడ్డారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారు తప్పా సాధించాలనే తాపత్రయం లేదని మండిపడ్డారు. ఈ నాలుగు సంవత్సరాల పాలనలో ఎప్పుడైనా నిజం మాట్లాడారా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారని ఆయన ప్రశ్నించారు. మీపైగాని, ప్రభుత్వంపై గాని ప్రశ్నిస్తే దాడి చేయించడం, అక్రమ కేసులు పెట్టించడం సిగ్గు అనిపించటం లేదా అని లేఖలో నిలదీశారు.

# ఆర్‌బీఐ సంచలన నిర్ణయం




ముంబై: పీఎన్‌బీ స్కాం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సంచలన నిర్ణయం తీసుకుంది. ఎల్‌వోయూ, లెటర్ ఆఫ్ కంఫర్ట్‌లను లను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆథరైజ్డ్ డీలర్లకు అన్ని బ్యాంకుల లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్, లెటర్ ఆఫ్ కంఫర్ట్‌ను రద్దు చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. భారతదేశంలోకి దిగుమతులకుద్దేశించిన వాణిజ్య రుణాలకోసం ఎల్‌వోయూ (స్వల్పకాలిక క్రెడిట్ రూపంలో బ్యాంకు మరొక ఇండియన్ బ్యాంకు విదేశీ బ్రాంచి నుంచి రుణం పొందానికి తన కస్టమర్‌ను అనుమతించే పత్రమే లెటర్ ఆఫ్ అండర్ స్టాండింగ్..ఎల్‌వోయూ) జారీ ప్రక్రియను నిలిపివేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. తక్షణమే తమ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో ప్రకటించింది. అయితే జూలై 1, 2015 నాటి బ్యాంకింగ్ నిబంధనలను లోబడి లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ కీలక నిర్ణయంతో దిగుమతి దారులకు భారీ షాక్ ? ఇచ్చింది. దీనిపై పరిశ్రమ వర్గాలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. ఎల్‌వోయూ, ఎల్‌వోసీ రూపంలో బ్యాంక్ గ్యారంటీలు పొందే దిగుమతుదారులను భారీగా ప్రభావితం చేయనుందని వాదించాయి.

# దాడిలో స్వాధీనం చేసుకున్న గంజాయి కాల్చివేత



విశాఖపట్నంః విశాఖపట్నం జిల్లా పోలీసులు జిల్లాలో కొత్తకోట సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు పట్టుకున్న 65 కేసులలో మొత్తం 7,637 కే.జీ.ల గంజాయిని కోర్టు అనుమతితో డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ ఆద్వర్యంలో కొత్తకోట పోలీసు స్టేషన్ పరిధి రావికమతం మండల, కల్యాణపు లోవ కొండల్లో గంజాయిని దహనం చేసినట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి సిహెచ్. శ్రీకాంత్ పేర్కొన్నారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్లు, కొత్తకోట, - 17 కేసులు, రోలుగుంట - 30 కేసులు, మాకవరపాలెం - 18 కేసులు మొత్తం 65 కేసులలో పట్టుబడిన గంజాయిని దహనం చేశారు. దీని అంచన విలువ సుమారుగా 5 కోట్ల రూపాయలు ఉంటుందని శ్రీకాంత్ తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో గంజాయి కోర్టు అనుమతితో దహనం చెయ్యడం ఇది రెండవ సారి అని పేర్కొన్నారు. మొదటి సారిగా మారికవలస డంపింగ్ యార్డ్ వద్ద 11,493 కేజీల గంజాయిని ఫిబ్రవరి 27వ తేదీన దహనం చేసినట్లు గుర్తు చేశారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి సిహెచ్ శ్రీకాంత్, డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ, చైర్మన్ మాట్లాడుతూ ఈ గంజాయిని దఫదఫాలుగా పోలీసు స్టేషన్లలో పేరుకుపోయిన నిల్వలను కోర్టు అనుమతితో దహనం చేస్తామని డిఐజి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, కె. అరీఫ్ హఫీజ్, ఎఎస్పి నర్సీపట్నం సిహెచ్ వివేకానంద, డిఎస్పి ఎస్సి ఎస్టి సెల్ బాబ్జిరావు, అసిస్టెంట్ కమిషనర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు కొత్తకోట సర్కిల్ ఎస్ఐలు సిహెచ్ హరికృష్ణ, డి. శేఖరం, ఎ. విజయ్‌కుమార్, వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులకు ఎస్‌బీఐ గుడ్‌న్యూస్

## కనీస నిల్వలపై ఛార్జీలు తగ్గింపు


దిల్లీ: ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతాదారులకు శుభవార్త. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే వసూలుచేసే ఛార్జీలను 75శాతం వరకు తగ్గించింది.

ప్రస్తుతం మెట్రో, అర్బన్ కేంద్రాల్లోని ఎస్‌బీఐ పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేని ఖాతాదారుల నుంచి నెలకు రూ. 50(జీఎస్‌టీ కాకుండా) చొప్పున, సెమీ- అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారుల నుంచి నెలకు రూ. 40(జీఎస్‌టీ కాకుండా) వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఛార్జీలను 75శాతం వరకు తగ్గించింది.

దీని ప్రకారం.. ఇకపై మెట్రో, అర్బన్ కేంద్రాల్లోని పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే రూ. 15(జీఎస్‌టీ కాకుండా) చొప్పున, సెమీ-అర్బన్ అయితే రూ. 12(జీఎస్‌టీ కాకుండా), గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాలకైతే రూ. 10(జీఎస్‌టీ లేకుండా) చొప్పున వసూలు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. సవరించిన ఛార్జీలు ఏప్రిల్ 1, 2018 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది.

కనీస నిల్వలపై ఛార్జీల పేరుతో ఎస్‌బీఐ రూ.వేల కోట్ల ఆదాయాన్ని గడిస్తోందంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఆ బ్యాంకు ఛార్జీల ద్వారా కేవలం ఎనిమిది నెలల్లోనే రూ. 1,771 కోట్లు గడించిందని కొందరు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఛార్జీలను తగ్గిస్తూ ఎస్‌బీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది.

# దేశ సేవలో ప్రాణ త్యాగం చేశారు : రాజ్‌నాథ్



న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై మావోయిస్టుల మెరుపుదాడిపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సుక్మా జిల్లాలో కిస్తారాం-పలోడీ జిల్లాల మధ్య జరిగిన ఐఈడీ పేలుడుపై ఆయన మంగళవారం ట్విటర్ వేదికగా స్పందించారు. ఈ దుర్ఘటనలో అమరులైన తొమ్మిది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు. వీరందరికీ గౌరవ వందనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వీరు దేశానికి సేవ చేస్తూ ప్రాణ త్యాగం చేశారని పేర్కొన్నారు. గాయపడిన జవాన్లు సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఆర్‌పీఎఫ్ ఇండియా డీజీతో ఈ దుర్ఘటనపై మాట్లాడినట్లు, వెంటనే ఛత్తీస్‌గఢ్ వెళ్ళాలని ఆయనను ఆదేశించినట్లు తెలిపారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com